RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM




4 లో ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి డిప్యూటీ కలెక్టర్ ఆదర్శం

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7569677170

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :246 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శనివారం 1 ఆగష్టు 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

# నేడు భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభానికి సర్వంసిద్ధం





**పీఎంఓ అధికారిక ప్రకటన విడుదల**

**ఆగస్టు 1న ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన**

**భోగాపురం నుంచి రూ.17,900 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం**

**భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్న ప్రధాని**

**విశాఖలో సెమీకండక్టర్ ప్లాంట్‌తో పాటు పలు విద్యుత్, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శంకుస్థాపన**

**ఏపీ పర్యటన అనంతరం కర్ణాటకకు పయనం**

**అమరావతి, సింధూరదర్శిని:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు (ఆగస్టు 1) ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఏపీలో సుమారు రూ.17,900 కోట్లకు పైగా విలువైన పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. విజయనగరం జిల్లా భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవం ప్రధాని షెడ్యూల్ లో కీలకంగా నిలవనుంది. మోదీ పర్యటనకు సంబంధించిన అధికారిక ప్రకటనను ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) విడుదల చేసింది. ఈ పర్యటన ఉత్తరాంధ్ర ప్రాంత ఆర్థిక ప్రగతికి గణనీయమైన ఊపునిస్తుందని భావిస్తున్నారు. అధికారిక షెడ్యూల్ ప్రకారం, ఆగస్టు 1న ఉదయం 10:45 గంటలకు ప్రధాని మోదీ ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి నేరుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ ఆయనకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతం పలుకుతారు. ఉదయం 10:58 గంటలకు ప్రధాని టెర్మినల్ భవనాన్ని ప్రారంభించి, అనంతరం గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులతో కలిసి విమానాశ్రయంలోని సౌకర్యాలను పరిశీలిస్తారు. ఆ తర్వాత, ప్రధాని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓపెన్-టాప్ వాహనం లో బహిరంగ సభా ప్రాంగణానికి బయలుదేరుతారు. మార్గమధ్యలో 13,500 మందికి పైగా గిరిజన మహిళలు, విద్యార్థులు సంప్రదాయ 'ధింసా' నృత్యంతో ఆయనకు ఘన స్వాగతం పలకనున్నారు. ఉద యం11:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:55 గంటల వరకు ప్రధాని బహిరంగసభలో ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1:10 గంటలకు కర్ణాటక మిగతా 2లో...



## పోటెత్తుతున్న గోదావరి

**భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ**

**భద్రాచలం వద్ద 48 అడుగులకు చేరుకున్న గోదావరి నీటి మట్టం**

**నిండుకుండలా మారిన తెలంగాణలోని జలాశయాలు**

**జలాశయాలకు వరద పెరుగుతుండటంతో అప్రమత్తమైన అధికారులు**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వచ్చి చేరుతున్న భారీ వరదతో నీటి మట్టం మధ్యాహ్నానికి ఏకంగా 48 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం అధికారులు 11,44,507 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నీటిప్రవాహం గంటగంటకూ పెరుగుతుండటంతో నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు, మిగతా 2లో...

## కర్ణాటకకు రావొద్దు..

**తమిళనాడు సీఎం విజయ్‌కు డీకే శివకుమార్ సూచన**

**కావేరి ఉద్రిక్తతల పర్యటన సరికాదని సూచన**

**అఖిలపక్ష సమావేశం తర్వాత కొత్త తేదీ**

**వర్షాలతో పరిస్థితులు మెరుగుపడతాయని డీకేఎస్ ఆశాభావం**

**మేకెదాటు ప్రాజెక్టు తమిళనాడుకూ ఉపయోగకరమన్న శివకుమార్**


**సుప్రీంకోర్టు తీర్పుకు కట్టుబడతామని స్పష్టీకరణ**



**సింధూరదర్శిని:** కావేరి వివాదం నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ బెంగళూరు పర్యటనను వాయిదా వేసుకోవాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ సూచించారు. ఆగస్టు 3న మంత్రులతో కలిసి బెంగళూరుకు వస్తానని విజయ్ తెలిపారని, ప్రస్తుత పరిస్థితుల్లో మిగతా 2లో...

## ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధం..

### మోదీ జీ మీ కోసం ఎదురుచూస్తున్నాం: సీఎం చంద్రబాబు




**నేడు భోగాపురం విమానాశ్రయాన్ని ప్రారంభించనున్న ప్రధాని మోదీ**

**భారీ భద్రత.. 7,000 మంది పోలీసుల మోహరింపు**

**ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముఖద్వారంగా ఈ విమానాశ్రయం**

**హాజరుకానున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

**అమరావతి, సింధూరదర్శిని:** "ఉత్తరాంధ్ర టేకాఫ్‌కు సిద్ధమైంది... మోదీ జీ, మీ రాక కోసం ఎదురుచూస్తున్నాం" అంటూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నానికి ఇప్పుడు రెక్కలొచ్చాయని, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ప్రాంత అభివృద్ధికి ముఖద్వారంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ పర్యటనపై ఫేస్ బుక్ వేదికగా చంద్రబాబు ఈ విధంగా స్పందించారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు (ఆగస్టు1) లాంఛనంగా

## మారనున్న ఉత్తరాంధ్ర రూపురేఖలు

**ఉత్తరాంధ్రకు భోగాపురం ఎయిర్‌పోర్టు గేమ్ ఛేంజర్**

**రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి**



## సూపర్ ఎల్ నినో సమయంలో ప్రతి నీటి బొట్టు విలువైనదే

-పవన్‌తో సమావేశమైన నిమ్మల రామానాయుడు
-రాష్ట్రంలోని సాగునీటి పరిస్థితులపై చర్చించిన నేతలు
-నీటి ఎద్దడిపై రైతుల్లో అవగాహన కల్పించాలన్న పవన్
-రాష్ట్రంలో సూపర్ ఎల్‌నినో ప్రభావం వల్ల నెలకొన్న
-సాగునీటి కొరతపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర
-ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి నీటి
-బొట్టు ఎంతో అమూల్యమైనదని, కాలువల్లో పూడిక తీత,
-గట్ల లీకేజీల నివారణ వంటి తక్షణ చర్యల ద్వారా నీటి
-వృథాను అరికట్టాలని పిలుపునిచ్చారు.



**అమరావతి, సింధూరదర్శిని:** డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సాగునీటి పరిస్థితు లపై ఇరువురూ విస్తృతంగా చర్చించారు. నీటి ఎద్దడిపై రైతుల్లో అవగాహన కల్పించడంతో పాటు, ప్రత్యామ్నాయ సాగు మార్గాలపై దృష్టి సారించాలని పవన్ సూచించారు. రైతుల ఆందోళనను తగ్గించేందుకు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా మిగతా 2లో...

## పెమ్మసానిపై ఏఐ వీడియో..

### అంబటి రాంబాబుపై సీఐడీ కేసు నమోదు

**మరోసారి చిక్కుల్లో పడిన మాజీ మంత్రి అంబటి రాంబాబు**

**కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానిపై ఏఐ వీడియో పోస్ట్ చేశారన్న ఆరోపణ**

**పెమ్మసాని ప్రతిష్టకు భంగం కలిగించేలా వీడియో ఉందని ఫిర్యాదు**

**పిల్లి మాణిక్యాలరావు ఫిర్యాదుతో చర్యలు చేపట్టిన పోలీసులు**

**గుంటూరు మంగళగిరి సీఐడీ ఆఫీసులో కేసు రిజిస్టర్**



**అమరావతి, సింధూరదర్శిని:** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై సీఐడీ కేసు నమోదైంది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో మిగతా 2లో...

## సీఐఐ ప్రతినిధుల సమావేశం..

-చంద్రబాబును గుర్తు చేసిన సీఎం రేవంత్ రెడ్డి
-పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం సురక్షితమన్న రేవంత్ రెడ్డి
-గత ప్రభుత్వాల మంచి విధానాలను కొనసాగిస్తామన్న ముఖ్యమంత్రి
-చంద్రబాబు, కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి ప్రస్తావన
-రాష్ట్రానికి 3 బుల్లెట్ రైలు ప్రాజెక్టులు, 2 కొత్త ఎయిర్‌పోర్టులు
-అమెజాన్, అదానీ గ్రూపుల భారీ పెట్టుబడుల వెల్లడి



**హైదరాబాద్, సింధూరదర్శిని:** పెట్టుబడులకు తెలంగాణ అత్యంత సురక్షితమైన, అనుకూలమైన రాష్ట్రమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నార్తర్న్ రీజనల్ కౌన్సిల్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో మిగతా 2లో...



## డయల్ యువర్ యస్.పి

నెల్లూరు( సింధూర దర్శిని) 31 జూలై నెల్లూరు జిల్లా జిల్లా పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా యస్.పి.డా. అజిత వెజెండ్ల 'డయల్ యువర్ యస్.పి.' (SP–సంపర్క్) కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయం నందు శుక్రవారం సాయంత్రం 3.00గంటల నుండి 5.00గంటల వరకు నిర్వహించారు. ప్రతి శుక్రవారం జరిగే ఈ కార్యక్రమం ద్వారా సిబ్బంది నేరుగా ఫోన్ ద్వారా తమ సమస్యలను యస్.పి. కి తెలియజేసే అవకాశం కల్పించబడింది. కార్యక్రమంలో 15 మంది పోలీసు సిబ్బంది ఫోన్ ద్వారా తమ సమస్యలను తెలియజేశారు. అందులో ముఖ్యముగా వారి బదిలీలు, సస్పెన్షన్ రివోక్, ఇతర పరిపాలనా అంశాల సంబందించిన అభ్యర్థనలు జిల్లా ఎస్పీ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రోగ్రాం నందు జిల్లా ఎస్. పి తో పాటు, చంద్రమౌళి సావిత్రమ్మ, సూపరింటెండెంట్ సురేష్, సూపరింటెం డెంట్ మస్తాన్‌రావు శ్రీనివాసరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్‌లను సంయుక్తంగా తనిఖీ

### జిల్లా జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్




నెల్లూరు(సింధూరదర్శిని) 31 జూలై నెల్లూరు జిల్లా; సుప్రీంకోర్టు మార్గదర్శ కాలు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఎమ్.ఐ.ఎస్ నవీకరణలో భాగంగా శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎమ్. వెంకటేశ్వర్లు, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్‌లు నగరంలోని ఘన వ్యర్థాల నిర్వహణ ప్రాసెసింగ్ ప్లాంట్లు, లెగసీ వ్యర్థాల డంపింగ్ యార్డులను సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నగర పరిధిలోని మొత్తం 6 ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్లు, 2 లెగసీ వ్యర్థాల డంపింగ్ యార్డులు, 1 నిర్మాణ మరియు కూల్చివేత వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్లను సందర్శించి, వాటి నిర్వహణ, పురోగతి, ప్రస్తుత పరిస్థితులను పరిశీలించారు. అలాగే, జిల్లా ఎమ్.ఐ.ఎస్‌లో నమోదు చేయాల్సిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు వారు సూచనలు చేశారు.

## మత్తు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు సహకరించాలి




గూడూరు (సింధూర దర్శిని) 31 జూలై నెల్లూరు జిల్లా; చిల్లకూరు మండలంలోని అపెక్స్ కంపెనీ వద్ద ఈగల్ పల్లె బాట అవగాహన సదస్సును నిర్వహించడం జరిగినది. ముఖ్యంగా యువతకు మత్తు పదార్థాల వల్ల కలిగే ఆరోగ్య,సామాజిక మరియు చట్టపరమైన దుష్పరిణామాలు గురించి వివరించడమైనది. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1972 టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ కి లేదా సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని, సమాచారం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేయడమైనది. మత్తు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని తెలియజేయడమైనది.

## విద్యార్థులకు మహిళా భద్రత పై అవగాహన

గూడూరు (సింధూర దర్శిని) 31 జూలై నెల్లూరు జిల్లా ; టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ మరియు శక్తి టీమ్‌తో కలిసి ఆది శంకర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు శక్తి యాప్ యొక్క వినియోగ విధానం, అత్యవసర పరిస్థితుల్లో యాప్ ద్వారా తక్షణ సహాయం పొందే విధానం, వ్యక్తిగత భద్రతా చర్యలు మరియు మహిళల రక్షణకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది.



# రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి సంక్షేమం

# ఇంటింటికి ప్రచారం

### ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



నెల్లూరు (సింధూరదర్శిని) 31 జూలై నెల్లూరు జిల్లా ; అభివృద్ధి పనులు చేయకుండానే ప్రజల్లోకి వెళ్తున్నామని ప్రతిపక్ష నేతలు చేస్తున్న విమర్శలకు, రెండేళ్లలో చేసిన అభివృద్ధి పనులే సమాధానమని కోవూరు శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దాదాపుగా అమలు చేసి, అభివృద్ధి–సంక్షేమ ఫలితాలతోనే ప్రజల ముందుకు వస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం కోవూరు నియోజకవర్గంలోని నార్తురాజు పాళెంలో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేశామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లులా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పాలన సాగిస్తోందని చెప్పారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రతి నెల ఒకటో తేదీన ఇంటి వద్దకే సామాజిక భద్రతా పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేల పెన్షన్ అందిస్తున్నామని చెప్పారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, దీపం–2, మత్స్యకారుల సేవలో, ఆటో సేవలో వంటి పథకాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుస్తున్నా మని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారమే మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేల మందికి ఉద్యోగాలు కల్పించామని, వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి రైతులకు రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రీసర్వేలు నిర్వహించి భూ సమస్యలను పరిష్కరిస్తున్నామని, అంగన్‌వాడీ సిబ్బందికి కూడా తల్లికి వందనం వర్తింపజేశామని తెలిపారు. పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్, అన్నా క్యాంటీన్లు, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. రాష్ట్రం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఉన్న సమయంలో కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిందని, అయినప్పటికీ రెండేళ్లలోనే దాదాపు అన్ని ఎన్నికల హామీలను అమలు చేశామని తెలిపారు. ఇంకా మూడేళ్ల పాటు ప్రజలకు మరింత మేలు చేసే కార్యక్రమాలను అమలు చేస్తామని చెప్పారు. కూటమి నాయకులు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ పనితీరును వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

#### నార్తురాజుపాళెంలో రూ.2.41 కోట్ల అభివృద్ధిజు

గత రెండేళ్లలో నార్తురాజుపాళెం పంచాయతీలో వివిధ శాఖల ద్వారా మొత్తం రూ.2.41 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇరిగేషన్ శాఖ ద్వారా రూ.17 లక్షలతో గుర్రపుడెక్క తొలగింపు, రెగ్యులేటర్ మరమ్మతులు చేపట్టగా, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ.87 లక్షలతో మూడు సీసీ రోడ్లు, రెండు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించారు. విద్యుత్ శాఖ ద్వారా రూ.79 లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద 40 ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్లు కల్పించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా రూ.16 లక్షలతో తాగునీటి పైపులైన్లు, బోరు, పంపుసెట్ ఏర్పాటు చేశారు. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఎస్‌ఆర్ నిధులతో రూ.20 లక్షల వ్యయంతో జెడ్పీ హైస్కూల్లో వాటర్ ప్లాంట్, అదనపు తరగతి గదులు, వంటగది పునరుద్ధరణ చేపట్టారు. అదేవిధంగా సొంత ఇంటి స్థలాలు ఉన్న 47 కుటుంబాల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 20 పేద కుటుంబాలకు రూ.22 లక్షల ఆర్థిక సాయం అందించినట్లు వెల్లడించారు.

#### త్వరలో రూ.45 కోట్ల ఫ్లైఓవర్

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో నార్తురాజుపాళెం ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.45 కోట్లతో త్వరలో టెండర్లు పిలవనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే నార్తురాజుపాళెం-- తాటాకులదిన్నె రోడ్డుకు రూ.2.80 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని, టపాతోపు--కోవూరు రోడ్డు ప్యాచ్ వర్క్‌కి రూ.25 లక్షలు ఇప్పటికే మంజూరయ్యాయని చెప్పారు. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేలా ఏఎంసీ ఆధ్వర్యంలో రైతు బజార్ ఏర్పాటుకు అనుమతులు లభించాయని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఇంటింటి ప్రచారం సందర్భంగా స్థానికులు రోడ్లు, కాలువల నిర్మాణంపై సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఇప్పటికే ఒక రోడ్డు మంజూరైందని, త్వరలోనే పనులు పూర్తి చేస్తామని తెలిపారు. కాలువల నిర్మాణ పనులను కూడా వేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతిపక్ష నేతలు అనవసర విమర్శలు చేస్తున్నారని, ప్రజలే తమ ప్రభుత్వ పనితీరుకు సాక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. గత ఐదేళ్లలో భయాందోళనల మధ్య జీవించిన ప్రజలకు ఇప్పుడు కూటమి ప్రభుత్వ పాలనపై నమ్మకం, విశ్వాసం ఏర్పడిందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత విభేదాలు ఉన్నా అంతిమంగా అందరూ తెలుగుదేశం పార్టీ కోసం కలిసి పనిచేయాలనే భావనతో ముందుకు సాగాలని సూచించారు.


## వీరారెడ్డి పల్లి లో ముమ్మరంగా టీడీపీ ఇంటింటి ప్రచారం

**పేద విద్యార్థుల భవిషత్ కు భరోసా తల్లికి వందనం- మహిళలకు ఆర్థిక సహకారం ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్**
**దేశంలో ఏ రాష్ట్రం లేని విధంగా వృద్దులకు, వితంతువులకు 4 వేలు, వికలాంగులకు 6 వేలు సామాజిక పింఛన్**



గూడూరు( సింధూరదర్శిని) 31 జూలై నెల్లూరు జిల్లా; తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తలపెట్టిన ఇంటింటి ప్రచారం కార్యక్రమం గూడూరు ఎమ్మెల్యే మరియు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశిం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు మాజీ కౌన్సిలర్ మరియు 15వ యూనిట్ ఇంచార్జ్ తాతపూడి ఇశ్రాయేల్ కుమార్ సూచనల ప్రకారం నేడు గూడూరు పట్టణం 27,28 వ వార్డులలో వీరారెడ్డి పల్లి నందు ఇంటింటి ప్రచారం ముమ్మరంగా కొనసాగుతుంది. ఇంటింటికి కరపత్రాలు పంచుతూ కూటమి ప్రభుత్వం ఈ రెండు సంవత్సరాలలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గూర్చి ప్రచారం చేస్తూ ప్రజలకు వివరించడం జరిగింది. ఈ సందర్భం గా యూనిట్ ఇంచార్జ్ ఇశ్రాయేల్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేరుస్తూ, అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. సామాజిక పెన్షన్స్ అత్యధికంగా ఏ రాష్ట్రం లేని విధంగా 4వేలు, 6వేలు, 10వేలు, 15వేలు ఇస్తున్న ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పించి ఆర్థిక సహకారం అందిస్తోందని, కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు చదువుకుంటే అంత మందికి తల్లికి వందనం పథకం కింద ఒక్కొక్కరికి 15000 చొప్పున ఇస్తూ పేద విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పిస్తోంద న్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో పట్టణ ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీ పూండ్ల శివయ్య, 10వ బూత్ కో కన్వీనర్ గంగలపూడి శ్రీనివాసులు, 28 వార్డు జనరల్ సెక్రటరీ కోవూరు మురళి, 10 వ బూత్ కన్వీనర్ మగ్గం రాజేష్, పరిమళ శ్రీనివాసులు, 11, 13 బూత్ కన్వీనర్లు నూనె వాసు యాదవ్, షేక్ ఆరీఫ్, 27 వార్డు అధ్యక్షుడు అన్నంగి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డును పరిశీలించిన వెటర్నరీ జాయింట్ డైరెక్టర్



గూడూరు (సింధూరదర్శిని) 31 జూలై నెల్లూరు జిల్లా; చిల్లకూరు మండల పరిధిలోని ముత్యాలపాడు వద్ద ఉన్న మార్కెట్ యార్డ్‌లో ప్రతి శుక్రవారం జీవాల సంతను నిర్వహిస్తుంటారు. శుక్రవారం మార్కెట్ యార్డును వెటర్నరీ జె.డి. రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవాలు దాహార్తి తీర్చేందుకు 9 నీటి తొట్టెలను ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా వ్యాపారస్తులు, రైతుల కొరకు త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా ఆర్వో ప్లాంట్ ను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే 14 మరుగుదొడ్లను ఏర్పాటు చేశామన్నారు. పాలక మండలితో చర్చించి అదనంగా పది మరుగు దొడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. క్రయ విక్రయాలు జరుగుతున్న ఒక్కొక్కజీవానికి మార్కెట్ కమిటీ నియమ నిబంధనలు మేరకే 50రూపాయలు వసూలు చేస్తున్నా రని, ఆన్లైన్ పర్మిట్ల కారణంగా ఎటువంటి అవకతవకలు జరిగే ఆస్కారం లేదన్నారు. 2018 – 19 సంవత్సరంలో షెల్టర్ కొరకు రెండు షెడ్లకు 92 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు కాంట్రాక్టర్ 39.60 లక్షలు ఖర్చు పెట్టి పిల్లర్స్ వరకు నిర్మాణం జరిపి షెడ్ల పై కప్పు లను షీట్స్‌తో అమర్చి అసంపూర్తిగా ఉందని, త్వరలోనే పాలక వర్గం దృష్టికి తీసుకు వెళ్లి ప్రతి పాదనలు తయారు చేసి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి షెడ్లను వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. ఈయన వెంట ఏడి మార్కెటింగ్ అనిత, సెక్రెటరీ జగదీష్ బాబు, అసిస్టెంట్ డైరెక్టర్, వెటర్నరీ డాక్టర్ సుబ్రహ్మణ్యం, పట్టాభిరెడ్డి తదితరులు ఉన్నారు.

# ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి డిప్యూటీ కలెక్టర్ ఆదర్శం



## జిల్లా కలెక్టర్ డాక్టర్. ఎస్ వెంకటేశ్వర్

తిరుపతి (సింధూరదర్శిని) 31 జూలై తిరుపతి జిల్లా; 35 సంవత్సరాలపాటు రెవెన్యూ శాఖలో నిబద్ధత, నిజాయితీ, అంకితభావంతో ప్రజలకు విశిష్ట సేవలందించిన డిప్యూటీ కలెక్టర్ కే.ఎం. రోజ్ మాండ్ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన డిప్యూటీ కలెక్టర్ కే.ఎం.రోజ్ మాండ్ పదవీ విరమణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు, జిల్లా రెవిన్యూ అధికారి జి.నరసింహులు లతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... డిప్యూటీ కలెక్టర్ కే.ఎం. రోజ్ మాండ్ 35 సంవత్సరాల పాటు రెవెన్యూ శాఖలో నిబద్ధత, నిజాయితీ, అంకితభావంతో ప్రజలకు సేవలందించి విజయవంతమైన ఉద్యోగ జీవితాన్ని పూర్తి చేశారని కొనియాడారు. ఉద్యోగ జీవితంలో ఎల్లప్పుడూ సానుకూల దృక్పథం, చిరునవ్వు, ప్రశాంత స్వభావంతో విధులు నిర్వర్తించడం ఆమె వ్యక్తిత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతలు ఎంత ఒత్తిడితో కూడుకున్నవైనా వృత్తి, వ్యక్తిగత జీవితాల మధ్య సమతుల్యతను పాటిస్తూ ఆదర్శవంతమైన కుటుంబ వ్యవస్థను నిర్మించుకోవడం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. రెవెన్యూ శాఖలో తహసీల్దార్‌గా, డిప్యూటీ కలెక్టర్‌గా, వివిధ ప్రభుత్వ శాఖల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ ఎల్లప్పుడూ సమర్థవంతమైన పరిపాలన అందించారని తెలిపారు. ముఖ్యంగా ఎన్నికల నిర్వహణ, భూ రక్షణకు సంబంధించిన సున్నితమైన అంశాలపై విచారణలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి క్లిష్టమైన బాధ్యతలను సమర్థంగా నిర్వహించి ప్రభుత్వానికి సమయానుకూలంగా, నిష్పాక్షికంగా నివేదికలు సమర్పించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ ప్రయోజనాలను పరమావధిగా తీసుకుని ఆమె అందించిన సేవలు ఆదర్శప్రాయమని ప్రశంసించారు. గత రెండేళ్లలో జిల్లా పరిపాలనలో అనేక కీలక బాధ్యతలను అత్యంత సమర్థంగా నిర్వహించడం ద్వారా జిల్లా యంత్రాంగానికి విశేష సహకారం అందించారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎన్నికల నిర్వహణ, వివిధ విభాగాలకు సంబంధించిన సమన్వయం, సున్నితమైన అంశాల పరిష్కారంలో ఆమె చూపిన చొరవ వల్ల జిల్లా పరిపాలన మరింత సమర్థవంతంగా సాగిందన్నారు. పదవీ విరమణ అనేది ఉద్యోగానికే పరిమితమని, ప్రజాసేవకు, జీవితానికి రిటైర్మెంట్ ఉండదని పేర్కొంటూ, ఉద్యోగ జీవితంలో సంపాదించిన అపార అనుభవాన్ని భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, మనవలు, మనవరాళ్లతో ఆనందంగా గడుపుతూ, మంచి ఆరోగ్యం, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం మరియు ప్రజలకు ఆమె అందించిన విశిష్ట సేవలకు కృతజ్ఞతలు తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు. పదవి విరమణ పొందిన డిప్యూటీ కలెక్టర్ కే.ఎం. రోజ్ మాండ్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో తన సేవా కాలమంతా సంతృప్తికరంగా సాగిందని, ఉద్యోగ జీవితంలో ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. తన ఉద్యోగ జీవితంలో సహకరించిన జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, డీఆర్వో, ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, సహోద్యోగులు, సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ జీవితంలో ఎదురైన ఒడిదుడుకులను ధైర్యంగా ఎదుర్కొనేందుకు తన కుటుంబ సభ్యులు అందించిన అండదండలు మరువలేనివని పేర్కొన్నారు. విద్యే గొప్ప ఆస్తి అనే భావనతో తన పిల్లలను ఉన్నత లక్ష్యాల వైపు ప్రోత్సహించామని తెలిపారు. తిరుపతి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్వోతో పాటు జిల్లాలోని అధికారులందరూ ఒక మంచి బృందంగా కలిసి పనిచేసి తనకు ఎంతో ఆత్మీయత, సహకారం అందించారని కొనియాడారు. తన పదవీ విరమణ సందర్భంగా ఘనంగా వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసిన జిల్లా యంత్రాంగానికి, కలెక్టరేట్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, జీవితాంతం వారి అభిమానాన్ని, సహకారాన్ని మరువబోనని అన్నారు. అనంతరం నేడు పదవీ విరమణ చేసిన డిప్యూటీ కలెక్టర్ రోజ్ మాండ్ దంపతులను జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, డి.ఆర్.ఓ. ఆర్.డి.ఓ లు, ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి, శ్రీకాళహస్తి,సూళ్లూరుపేట ఆర్డీఓలు, రామ్మోహన్, బానుప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శివశంకర్ నాయక్, భరత్ నాయక్,నాగార్జున, జిల్లాలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, కలెక్టరేట్ రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల నియంత్రణలో బ్యాంకుల పాత్ర అత్యంత కీలకం





## జిల్లా ఎస్పీ డా. అజితా వేజెండ్ల

నెల్లూరు (సింధూర దర్శిని) 31 జూలై నెల్లూరు జిల్లా ; జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల అధ్యక్షతన జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్‌బ్యాంకుల నోడల్ అధికారులు, బ్రాంచ్ మేనేజర్లతో సైబర్ నేరాల నివారణ, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ డా. అజితా వేజెండ్ల పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రస్తుతం సమాజంలో వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాలు, వాటి కొత్త ఎత్తుగడలు , అలాగే మోసాలకు గురైన బాధితులకు త్వరితగతిన నిధులు తిరిగి అందించే అవకాశాలపై సమగ్రంగా వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్, ఇన్వెస్ట్‌మెంట్ ఽ ట్రేడింగ్ ఫ్రాడ్స్, క్రెడిట్/డెబిట్ కార్డ్ మోసాలు, ఆన్‌లైన్ లోన్ మోసాలు వంటి సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని తెలిపారు. ఈ నేరాల ద్వారా మోసపోయిన సొమ్ము చివరకు మ్యూల్ బ్యాంక్ ఖాతాల ద్వారా బదిలీ అవుతుండటంతో, వాటిని గుర్తించి అడ్డుకోవడంలో బ్యాంకుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మ్యూల్ అకౌంట్స్ గ్రీవెన్స్ రెడ్రెసల్ మాడ్యూల్ మరియు మనీ రికవరీ మాడ్యూల్ విధానాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సైబర్ మోసాలకు గురైన బాధితులు 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. ముఖ్యంగా "గోల్డెన్ అవర్" గా పరిగణించే తొలి 30 నిమిషాల్లో సంబంధిత బ్యాంక్ ఖాతాలను హోల్డ్ లేదా ఫ్రీజ్ చేయగలిగితే బాధితులకు నిధులు తిరిగి అందించే అవకాశం గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి బ్యాంకు అధికారి అత్యవసర స్పందనతో వ్యవహరించాలని సూచించారు. అలాగే కొత్తగా ప్రారంభించే కరెంట్ అకౌంట్లలో కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా కచ్చితంగా అమలు చేయాలని, అనుమానాస్పద లావాదేవీలను వెంటనే గుర్తించి పోలీసులకు సమాచారం అందించాలని, జిల్లా పోలీసు శాఖతో నిరంతర సమన్వయం కొనసాగించాలని సూచించారు. సైబర్ నేరాల దర్యాప్తులో అవసరమైన బ్యాంక్ స్టేట్‌మెంట్లు, కేవైసీ వివరాలు, సీసీటీవీ ఫుటేజ్‌తో పాటు ఇతర సాంకేతిక సమాచారాన్ని ఎటువంటి జాప్యం లేకుండా అందించడం ద్వారా దర్యాప్తు వేగవంతమై నేరస్థులను త్వరగా గుర్తించే అవకాశం ఉంటుందని ఎస్పీ వివరించారు. ప్రతి బ్యాంకు శాఖలో సైబర్ భద్రతపై అవగాహన పోస్టర్లను ఏర్పాటు చేయాలని, ఖాతాదారులు ఓటిపి , పి ఐ ఎన్ , సి వి వి వంటి గోప్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోరాదని అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, గ్రామీణ ప్రాంత ప్రజలకు సైబర్ మోసాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ మేనేజర్ మనిశేఖర్ మాట్లాడుతూ, కొంతమంది విద్యార్థులు స్వల్ప ఆర్థిక ప్రయోజనాల కోసం తమ బ్యాంక్ ఖాతాలను ఇతరులకు వినియోగించేందుకు ఇస్తున్నారని, దీనివల్ల సైబర్ నేరాలకు పరోక్షంగా అవకాశం కలుగుతోందని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల కష్టార్జితాన్ని కాపాడటం పోలీసు శాఖ, బ్యాంకులు, ప్రజలందరి ఉమ్మడి బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు. బ్యాంకుల సకాల స్పందన, పోలీసుల సమర్థవంతమైన దర్యాప్తు, ప్రజల అప్రమత్తతతోనే సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు. జిల్లా స్థాయిలో పోలీసు-- బ్యాంకుల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, సైబర్ నేరాల నియంత్రణలో నెల్లూరు జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా సైబర్ క్రైమ్ విభాగం పోలీస్ అధికారులు, వివిధ బ్యాంకుల నోడల్ అధికారులు, బ్రాంచ్ మేనేజర్లు మరియు ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆగస్టు 1న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ

## ఓటర్ల అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి



నెల్లూరు( సింధూర దర్శిని) 31 జూలై నెల్లూరు జిల్లా ; భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర సవరణ సర్-2026 కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 1న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు జిల్లా రెవిన్యూ అధికారి విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ముసాయిదా జాబితా ప్రచురణ ఏర్పాట్లను వివరించారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన 2,460 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 16,84,176 మంది ఓటర్లు ముసాయిదా జాబితాలో ఉన్నారని తెలిపారు. ఇందులో పురుషులు 8,25,447 మంది, మహిళలు 8,58,567 మంది, ఇతరులు 162 మంది ఉన్నారని వెల్లడించారు. ఆగస్టు 1 నుంచి ఓటర్ల జాబితాపై ఫారం-6, 6ఏ, 7, 8 ద్వారా కొత్తగా పేరు నమోదు, మార్పులు, తొలగింపులు, చిరునామా సవరణలు, ఈ పి ఐ సి వివరాల సవరణ వంటి అభ్యర్థనలను స్వీకరిస్తామని తెలిపారు. దరఖాస్తులను సంబంధిత ERO/AERO కార్యాలయాల్లో లేదా https://voters.eci.gov.in? వెబ్‌సైట్ ద్వారా సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఓటరు జాబితాకు సంబంధించిన అభ్యంతరాలపై ఆర్ పి యాక్ట్--1950 నిబంధనల ప్రకారం అప్పీల్ అవకాశం కూడా ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సరిచూసుకొని అవసరమైన మార్పులు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.




# అమరావతి ఛాంపియన్ షిప్

## మేయర్ దేవరకొండ సుజాత

### పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరు( సింధూర దర్శిని) 31 జూలై నెల్లూరు జిల్లా ; భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆగస్టు 29వ తేదీన నిర్వహించే "జాతీయ క్రీడా దినోత్సవం" సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, విజయవాడ వారి ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లాలో "అమరావతి ఛాంపియన్ షిప్ - 2026" క్రీడా పోటీలను నిర్వహించనున్నామని నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ దేవరకొండ సుజాత తెలిపారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎ.సి. సుబ్బా రెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో పోటీలకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పోటీలు జూలై 15, 2026 నుండి ఆగస్టు 26, 2026 వరకు నియోజకవర్గ స్థాయి నుండి ప్రారంభమై, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి వరకు వివిధ దశల్లో నిర్వహించబడతాయని వివరించారు. ఈ పోటీలు అండర్ -17 మరియు అండర్ - 23 విభాగాలలో (బాలబాలికలకు విడివిడిగా) ఆర్చరీ, అథ్లెటిక్స్, బాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్ బాల్, చెస్, హాకీ, కబడ్డీ, ఖో-ఖో, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్, యోగా మొత్తం 12 క్రీడాంశాలలో నిర్వహిస్తారని తెలిపారు. నియోజకవర్గ స్థాయి ఎంపికైన క్రీడాకారులను జిల్లా స్థాయికి, జిల్లా స్థాయి పోటీలలో ఎంపికైన జట్లు , క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలలో నెల్లూరు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని ప్రకటించారు. క్రీడాకారులంతా ఉత్తమ ప్రతిభ కనబరిచి నెల్లూరుకు ఖ్యాతి తీసుకురావాలని మేయర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.డి.ఓ పాండురంగారావు, డిప్యూటీ డైరెక్టర్ మాధురి, ఎమ్.ఈ.ఓ హమీద్, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బేషరతుగా విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలి

## విద్యార్థులపై దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలి


### సీపీఐ నాయకుల డిమాండ్




గూడూరు (సింధూరదర్శిని) 31 జూలై నెల్లూరు జిల్లా; ఢిల్లీ ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై కేసులు నమోదు చేయడాన్ని గూడూరు సీపీఐ శాఖా నాయకులు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం గూడూరు సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్ యాదాల మాట్లాడుతూ ఎన్డీయే అవలంభిస్తున్న విద్యా, నిరుద్యోగ వ్యతిరేక విధానాలు, నీట్ లేకేజీ తో బేజారైన యువత రోడ్డెక్కిందన్నారు. తమ హక్కుల సాధన కోసం కాక్రోచ్ పార్టీతో కలిసి శాంతియుత నిరసన దీక్షలు చేశారన్నారు. వారిపై అన్యాయంగా కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. సామాజిక శాస్త్రవేత్త సోనమ్ వాంగ్ చుక్ కు కేంద్ర మంత్రులు ఇచ్చిన వాగ్దానం మేరకు విద్యార్థులు, విద్యార్థి నేతలు, సీజేపీ పై పెట్టిన కేసులను తొలగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి ఉద్యమంలో జొరబడి రక్త గాయలయ్యేలా విచక్షణా రహితంగా దాడులు చేసిన ఆర్ఎస్ఎస్ మూకలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి షేక్ జమాలుల్లా, చిల్లకూరు మండల కార్యదర్శి గుండాల రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కొమ్మి నారాయణ, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్లు (సీపీఎల్), పీఎన్ఎం పట్టణ కార్యదర్శి మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రైం న్యూస్

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



గూడూరు( సింధూర దర్శిని) 31 జూలై నెల్లూరు జిల్లా; ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య పోలీసుల వివరాల మేరకు గూడూరు ఒకటవ పట్టణంలోని పి ఎస్ ఆర్ పార్క్ వద్ద నివాసముంటున్న పాలెం నాగేంద్ర (33) తండ్రి ఉమామహేశ్వరరావు కు 2019 లో హేమలత వివాహం జరిగింది. మృతుడు ఒక ఎగ్స్ సెంటర్లో ఆటో డ్రైవర్ గా పని చేస్తున్నాడు. భార్య హేమలత నెల్లూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో నర్సుగా విధులు నిర్వహిస్తుంది. భార్య భర్తల మధ్య కొంతకాలంగా చిన్న చిన్న కుటుంబ కలహాలు జరుగుతూ ఉండేవని, ఆ కుటుంబాల కారణంగా మన స్థాపన గురైన మృతుడు ఇంటిలోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని తెలియజేశారు.

# సినిమా థియేటర్ యాజమాన్యాలతో సమావేశం



## జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు

తిరుపతి ( సింధూర దర్శిని) 31 జూలై 31 తిరుపతి జిల్లా ; జిల్లాలోని సినిమా థియేటర్ యాజమాన్యాలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఢ లైసెన్సింగ్ అథారిటీ పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలోని డిజిటల్ సినిమా స్క్రీన్ల వివరాలు, థియేటర్ల నమోదు, ఎన్ఓసీల జారీ, పెండింగ్ పరిపాలనా రుసుములు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. తిరుపతి జిల్లాలో మొత్తం 32 సినిమా థియేటర్లు ఉండగా, వాటిలో యు ఎఫ్ ఓ ప్లాట్‌ఫారమ్‌లో 15 సింగిల్ స్క్రీన్లు, 5 మల్టీప్లెక్స్ స్క్రీన్లు కలిపి 20 స్క్రీన్లు, క్యూబి ప్లాట్‌ఫారమ్‌లో 8 సింగిల్ స్క్రీన్లు, 3 మల్టీప్లెక్స్ స్క్రీన్లు కలిపి 11 స్క్రీన్లు పనిచేస్తున్నాయని తెలిపారు. మొత్తం 31 డిజిటల్ సినిమా స్క్రీన్లు ఈ రెండు ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 20 సినిమా థియేటర్లు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫిల్మ్, టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లో ఎన్ఓసీల మంజూరు/ పునరుద్ధరణ కోసం నమోదు చేసుకున్నాయని తెలిపారు. వీటిలో 14 థియేటర్లకు రూ.7,32,883 పరిపాలనా రుసుములు ( ఎన్ ఓ సి ఫీజులు/అడ్మినిస్ట్రేటివ్ ఛార్జీలు) బకాయిగా ఉన్నాయని పేర్కొన్నారు.అదేవిధంగా, జిల్లాలో 26 సినిమా థియేటర్లు ఇప్పటికీ ఏపీ ఎస్ ఎఫ్ టివి టి డి సి లో నమోదు చేసుకోకుండా ఫారం–బి లైసెన్స్ ఎన్ఓసీల మంజూరు/పునరుద్ధరణ ప్రక్రియను పూర్తి చేయలేదని తెలిపారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు సంబంధిత సినిమా థియేటర్ యాజమాన్యాలకు ఈ క్రింది ఆదేశాలు జారీ చేశారు: పెండింగ్‌లో ఉన్న పరిపాలనా రుసుములను తక్షణమే చెల్లించాలి. ఏపీ ఎస్ ఎఫ్ టి వి టి డి సి లో నమోదు చేసుకుని ఎన్ఓసీల మంజూరు లేదా పునరుద్ధరణ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలి.సినిమా థియేటర్ యాజమాన్యాలు సంబంధిత శాఖల నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, అవసరమైన అన్ని లైసెన్సులు పొందాలని సూచించారు. సినిమా థియేటర్ల నిర్వహణలో చట్టబద్ధమైన విధానాలను అనుసరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్ రావు పాల్గొన్నారు.

# ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రతినిధులతో వేమిరెడ్డి దంపతుల భేటీ

**కిసాన్ సెజ్‌లో పెట్టుబడులు, ఉద్యోగావకాశాలపై చర్చ**

**యువతకు నైపుణ్య శిక్షణ కోసం వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్: వేమిరెడ్డి దంపతులు**



నెల్లూరు( సింధూర దర్శిని) 31 జూలై నెల్లూరు జిల్లా ; నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులను ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కోఆపరేటివ్ లిమిటెడ్ ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రతినిధులు శుక్రవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని వేమిరెడ్డి దంపతుల నివాసంలో జరిగిన ఈ భేటీలో ఇఫ్కో కిసాన్ సెజ్ ఛైర్మన్ దిలీప్ సంఘాని, మేనేజింగ్ డైరెక్టర్ కేజే పటేల్ పాల్గొన్నారు. దిలీప్ సంఘాని, పటేల్ కి వేమిరెడ్డి దంపతులు జ్ఞాపిక అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా కిసాన్ సెజ్ పరిధిలో పారిశ్రామిక అభివృద్ధి, కొత్తగా పెట్టుబడులను ఆకర్షించడం, నెల్లూరు జిల్లా యువతకు పెద్దపీట వేస్తూ ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంపై చర్చించారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో త్వరలోనే భారీ పరిశ్రమలు ప్రారంభం కాబోతుండటంతో, ఈ పరిశ్రమల్లో స్థానిక యువతకే ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని వేమిరెడ్డి దంపతులు తెలిపారు. పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా స్థానిక యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు వీపీఆర్ ఫౌండేషన్ తరఫున త్వరలోనే ఒక 'స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్' ప్రారంభించబోతున్నట్లు వెల్లడించారు. ఈ సెంటర్ ద్వారా యువతకు అవసరమైన ప్రత్యేక సాంకేతిక, వృత్తి విద్యా శిక్షణను ఉచితంగా అందించి, పరిశ్రమలలో ఉద్యోగాలు పొందేలా తీర్చిదిద్దుతామని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టరు మొగిలి వెంకటేశ్వర్లు , ఇఫ్కో సీఈఓ సుధాకర్ పాల్గొన్నారు.

## బ్యాంక్ మేనేజర్ ముని చందనకు ఘన సన్మానం



రాపూరు( సింధూర దర్శిని) 31 జూలై నెల్లూరు జిల్లా; బదిలీ పై వెళుతున్న డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ బి.ముని చందన ను బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు ఘనంగా సన్మానించారు.నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రాపూరు బ్రాంచి మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న బీ.ముని చందన వెంకటగిరి బ్రాంచీ కి బదిలీ అయ్యారు. ఈ సంధర్భంగా ఆమెను శుక్రవారం బ్యాంకు అధికారులు, ఖాతాదారులు ఘనంగా సన్మానించారు. రెండున్నర సంవత్సరాలు పాటు బ్యాంకులో అందరితో మమేకమై విశేష సేవలందించారని కొనియాడారు.ఆమె విధి నిర్వహణలో సమర్ధంగా పనిచేసి ఖాతాదారుల మన్ననలు పొందారని,భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా రాపూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ ఎస్పీ నరసింహం యాదవ్ మాట్లాడుతూ బదిలీ పై వెళ్తున్న మేనేజర్ ముని చందన రాపూరు బ్రాంచీలో మేనేజర్ గా బాధ్యతలు చెప్పటిన నాటికి రాపూరు బ్రాంచీ 22 కోట్లు టర్నోవర్ ఉండగా ఆమె రెండున్నర ఏళ్ల కాలంలో 50కోట్లు టర్నోవర్‌కు చేర్చారన్నారు. ఇదే విధంగా విధి నిర్వహణలో నిజాయితీ, క్రమశిక్షణ, సేవా భావం ఉంటే ఖాతాదారుల ఆదరణతో పాటు ఉన్నతాధికారుల ప్రశంసలు కూడా లభిస్తాయని అన్నారు. ఉద్యోగులకు బదిలీ సర్వసాధారణమని ఎక్కడ విధులు నిర్వహించిన అంకిత భావంతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించి బ్యాంక్ కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కొత్తగా బదిలీ అయిన ప్రాంతాల్లో కూడా ఇదే విధమైన సేవా తత్వంతో పనిచేసి ఖాతాదారులకు మరింత చేరువ కావాలని,తమ అనుభవంతో డీసీసీబీ బ్యాంక్ కు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాపూరు డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ తిరుపతి శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ పొదిలి పరందామయ్యా,ఎస్ కె ఖాసీం,విశ్రాంత బ్యాంక్ మేనేజర్ కె.వెంకటేశ్వర్లు,ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందికి ఘన వీడ్కోలు

**జిల్లా ఎస్.పి. డా. అజితా వేజెండ్ల**




నెల్లూరు( సింధూర దర్శిని) 31 జూలై నెల్లూరు జిల్లా; జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం పదవీ విరమణ పొందుతున్న పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్.పి. డా. అజిత వేజెండ్ల ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందుతున్న సిబ్బందిని వారి కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు, దుశాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేసి వారి విశిష్ట సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి. మాట్లాడుతూ, పోలీసు సేవ అనేది క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావం, ధైర్యసాహసాలు మరియు ప్రజాసేవకు ప్రతీక అని పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిన ప్రతి పోలీసు ఉద్యోగి పోలీసు శాఖకు విలువైన ఆస్తి అని కొనియాడారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, సమాజానికి సేవ చేసే అవకాశం ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.పి. తో పాటు,హోమ్ గార్డ్ డీఎస్పీ రామకృష్ణ, ఏఓ చంద్రమౌళి, ఎస్‌బీ–2 సీఐ శ్రీనివాస రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఏఆర్(అడ్మిన్) ఆర్ఐ హరిబాబు, ఆర్ఐ వెల్ఫేర్ రాజారావు, హోమ్ గార్డ్ పాల్ రాజు,పోలీస్ అసోసియేషన్ కోశాధికారి తురకా. శ్రీనివాసులు, ఇతర అధికారులు, సిబ్బంది మరియు పదవీ విరమణ పొందిన సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## సుదీర్ఘ రోజులుగా పెన్ డౌన్ కార్యక్రమం

తాడికొండ,సింధూరదర్శిని: ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటీకరణ చేయాలని జారీ చేసిన జీవో NS.No 396జీవో నీ ఉపసంహరించుకోవాలని విన్నవించుకుంటూ జూలై 20 నుండి 31వ తేదీ వరకు జరుగుతున్న సామూహిక పెన్ డౌన్ కార్యక్రమాన్ని దస్తావేజు లేఖరులు మరియు స్టాంప్ వెండర్,డిటిపి ఆపరేటర్స్ మరియు సహాయకులు నిర్వహించిన కార్యక్రమం విజయవంతంగా సాగింది. ప్రైవేటీకరణ విధివిధానాలను వ్యతిరేకిస్తున్నట్లు జీవో ద్వారా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేయడం వల్ల ప్రజల ఆస్తుల భద్రత మరియు గోప్యతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నదని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఫ్రంట్ ఆఫీసులను ఏర్పాటు చేసి వాటిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని చూడటం వల్ల దస్తావేజు లేఖరులు,స్టాంపు వెండర్,డిటిపి ఆపరేటర్స్ మరియు సహాయకులు అందరూ తమ జీవనోపాధి కోల్పోవలసి వస్తుందని చట్టబద్ధతలేని ప్రైవేటు సంస్థల పరం చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమని ఇలాంటి మార్పుల వలన అవకతవకలు జరిగి ప్రజలు ఇబ్బందికి గురి అయ్యే ప్రమాదం ఉంది కనుక ప్రభుత్వం ఆలోచించి పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య విధాన ప్రతిపాదనను నిర్మించుకోవాలని దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం ఇచ్చిన పిలుపుమేరకు పెన్ డౌన్ కార్యక్రమం మండల కేంద్రమైన తాడికొండలోని రిజిస్టర్ కార్యాలయం ముందు జరిగింది. పూర్వం నుండి దస్తావేజులేఖరు వృత్తిని నమ్ముకుని రాష్ట్రంలో వేలాది కుటుంబాలు జీవించుచున్నాయని ఎంతోమంది పట్టభద్రులకు ఉద్యోగ అవకాశం లేకుండా నిరుద్యోగులుగా ఉంటూ దస్తావేజు లేఖరి వృత్తి తమ కుటుంబాలను పోషించాలని ఎంచుకొని జీవించుచున్నారని దస్తావేజులేఖరుల వ్యవస్థను కొనసాగించాలని సభ్యులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. జీవో మీా చీా.396 గల జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రైవేటు భాగస్వామ్యం వద్దు ప్రజల ఆస్తుల భద్రత ముఖ్యం మా ఉపాధి కాపాడుకోవడం మా అందరి బాధ్యత వంటి నినాదాలతో సమ్మె విజయవంతంగా సాగింది.

## తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి ఘన సన్మానం



తెనాలి సింధూరదర్శిని: తెనాలి సహాయ మలేరియా అధికారిగా పనిచేయుచున్న చిరసాని ప్రభాకరరెడ్డి 36 సంవత్సరాలు వైద్య ఆరోగ్యశాఖలో సుదీర్ఘ సేవలు అందించి శుక్రవారం ఉద్యోగ విరమణ చేయుచున్న సందర్భముగా అభినందన సత్కార సభకు ముఖ్యఅతిథిగా జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ,సుబ్బరాయణం పాల్గొని కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించడం జరిగినది. సభలో వక్తలు మాట్లాడుతూ సేవా తత్పరతతో ఉద్యోగ ధర్మాన్ని నిర్వహించిన చిరసాని ప్రభాకరరెడ్డి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్ చార్జ మునిసిపల్ కమిషనర్ జాస్తి రామారావు, ఇన్ చార్జ్ సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి, యుయల్ బి సబ్ యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమౌళి, సీనియర్ హెల్త్ ఇన్స్పెక్టర్ గుద్ధంటి రవికుమార్ ,గుంటూరు సబ్ యూనిట్ అధికారి సూదశివ గణేష్, సూపర్వైజర్స్ దీపాల శ్రీనివాసరావు బండారు మల్లేశ్వరరావు , తిరువీధుల శివరాం ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్స్ మలేరియా ఫైలేరియా, ఈమని, కొలకలూరు, సంగం జాగర్లమూడి, చేబ్రోలు, వేజెండ్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## అటవీ శాఖ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ వెదజల్లిన విద్యార్థులు

మాచర్ల సింధూరదర్శిని: అటవీ విస్తీర్ణాన్ని పెంపొందించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే లక్ష్యంతో శుక్రవారం మాచర్ల బీటులో సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల సెక్షన్ ఆఫీసర్ కె. వెంకయ్య, మాచర్ల ఎఫ్‌బీఓ ఆర్. రాకేష్ ఆధ్వర్యంలో జడ్పీ గర్ల్స్ హై స్కూల్, విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అటవీ అధికారులు మొక్కల పెంపకం, అడవుల సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణలో సీడ్ బాల్స్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించడం ద్వారా పచ్చని పర్యావరణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. విద్యార్థులు అటవీ ప్రాంతంలోని అనుకూల ప్రాంతాల్లో సీడ్ బాల్స్ వెదజల్లి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించారు.

## స్థల సేకరణ చేయాలి: కలెక్టర్

నరసరావుపేట, సింధూరదర్శిని:శుక్రవారంనజిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల రెవెన్యూ డివిజన్ కేంద్రాలలో కోర్టు బిల్డింగులు ఏర్పాటు చేయుటకు స్థల సేకరణ చేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి కలెక్టర్ నరసరావుపేట,గురజాల, సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారులు బాలకృష్ణ, మురళీకృష్ణ, గోపాలకృష్ణ లతో పాటు తాసిల్దారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కోర్టు బిల్డింగుల నిర్మాణాల కొరకు స్థల సేకరణను వేగవంతం చేయవలసిందిగా ఆదేశించారు.



# గూగుల్‌లో ఉద్యోగమే కాదు.. చేరాక ఎదగడమూ కష్టమే..

గూగుల్‌లో పని అనుభవం పంచుకున్న భారతీయ ఉద్యోగిని

ఉద్యోగం కంటే ఎదగడమే పెద్ద సవాల్ అని వెల్లడి

వర్క్–లైఫ్ బ్యాలెన్స్ బాగుంటుందని వ్యాఖ్య

రోజూ 10–12 గంటల పని నిజం కాదని స్పష్టీకరణ

ప్రమోషన్ల కోసం అదనపు శ్రమ అవసరమన్న అభిప్రాయం

అమెరికాకు వెళ్లడం జీవితంలో ఉత్తమ నిర్ణయమన్న ప్రియా



గూగుల్‌లో ఉద్యోగం అంటే చాలామందికి కల. కానీ అక్కడ చేరిన తర్వాత పరిస్థితులు ఎలా ఉంటాయి? పని ఒత్తిడి ఎలా ఉంటుంది? ఎదగడం ఎంత కష్టం? ఈ ప్రశ్నలకు అమెరికాలోని గూగుల్ ఆఫీసులో పనిచేస్తున్న భారతీయ ఉద్యోగిని ప్రియా తన అనుభవాలను పంచుకుంది. ఆమె వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ఉద్యోగంలో చేరిన తొలి రోజుల్లో తాను జీవితంలో అతిపెద్ద లక్ష్యాన్ని సాధించిన భావన కలిగిందని ప్రియా తెలిపింది. కంపెనీ పేరు, జీతం, ఉద్యోగం అన్నీ ఎంతో సంతోషం ఇచ్చాయని చెప్పింది. అయితే కొంతకాలం పనిచేసిన తర్వాత అక్కడి వాస్తవ పరిస్థితులు అర్థమయ్యాయని వివరించింది. గూగుల్‌లో అత్యంత ప్రతిభావంతులైన ఉద్యోగులు ఉండటంతో పదోన్నతులు, కెరీర్‌లో ఎదుగుదల చాలా పోటీతత్వంలో కూడుకొని ఉంటాయని చెప్పింది. పని–వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత మాత్రం గూగుల్‌లో బాగానే ఉంటుందని ప్రియా తెలిపింది. రోజూ 10 నుంచి 12 గంటలు పనిచేయాల్సి వస్తుందన్న ప్రచారం నిజం కాదని స్పష్టం చేసింది. కొన్ని రోజులు పని ఎక్కువగా ఉంటే.. మరికొన్ని రోజులు తక్కువగా ఉంటుందని చెప్పింది. అయితే ప్రమోషన్లు, పెద్ద బాధ్యతలు కోరుకునే వారు స్వచ్ఛందంగానే అదనపు సమయం పనిచేసేందుకు సిద్ధపడతారని వెల్లడించింది. లండన్, చికాగో, న్యూయార్క్‌లో పనిచేసిన అనుభవాన్ని కూడా ఆమె వివరించింది. అమెరికాకు రావడం సరైన నిర్ణయమేనా అనే సందేహం ఒక దశలో కలిగిందని చెప్పింది. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే అదే తన జీవితంలో అత్యుత్తమ నిర్ణయమని భావిస్తున్నట్లు తెలిపింది. ప్రియా వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి.

# రైళ్లలో ఎక్కువ లగేజీ తీసుకెళ్తున్నారా?.. ఈ కొత్త రూల్ మీకోసమే!

రైళ్లలో అదనపు లగేజీకి ఆన్‌లైన్‌లో బుకింగ్ సౌకర్యం – ఇవాళ్టి నుంచి అమల్లోకి కొత్త విధానం

కన్ఫర్మ్ రిజర్వ్ టికెట్లు ఉన్న ప్రయాణికులకే ఈ సదుపాయం – తరగతుల వారీగా లగేజీ పరిమితులు, చార్జీల వివరాలు వెల్లడి

పార్శిల్ ఆఫీసుల వద్ద రద్దీ తగ్గించడమే ఈ మార్పు లక్ష్యం




భారతీయ రైల్వే ప్రయాణికులకు ఒక ముఖ్యమైన శుభవార్త. రైళ్లలో ప్రయాణించేటప్పుడు అదనపు లగేజీని తీసుకెళ్లేవారి కోసం రైల్వే శాఖ సరికొత్త ఆన్‌లైన్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. కన్ఫర్మ్ రిజర్వ్ టికెట్లు ఉన్న ప్రయాణికులు ఇకపై తమ అదనపు లగేజీని ఐఆర్‌సీటీసీ ప్లాట్‌ఫామ్ ద్వారా టికెట్ బుక్ చేసుకునే సమయంలోనే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. ఈ కొత్త విధానం ఇవాళ్టి నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. ఇప్పటివరకు అనుమతించిన దానికంటే ఎక్కువ లగేజీ ఉన్నవారు రైల్వే స్టేషన్‌లోని పార్శిల్ ఆఫీసుకు వెళ్లి బుక్ చేసుకోవాల్సి వచ్చేది. ఈ ప్రక్రియను సులభతరం చేసి, ప్రయాణికుల సమయం ఆదా చేయాలనే లక్ష్యంతో ఈ మార్పును తీసుకొచ్చారు.

ఈ కొత్త సదుపాయం కేవలం కన్ఫర్మ్ రిజర్వ్ టికెట్లు ఉన్నవారికి, వారు ప్రయాణించే రిజర్వ్ కంపార్ట్‌మెంట్‌లోనే లగేజీని తీసుకెళ్లే సందర్భంలో మాత్రమే వర్తిస్తుంది. ప్రయాణికులు ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకునేటప్పుడు, ఉచిత లగేజీ పరిమితిని మించిన సామాను వివరాలను పొందుపరచవచ్చు. ఆ సమయంలో సిస్టమ్ వారికి తరగతుల వారీగా ఉచిత లగేజీ పరిమితి, గరిష్ఠంగా ఎంత బరువు తీసుకెళ్లవచ్చు, నిషేధిత వస్తువులు, వర్తించే చార్జీలు, జరిమానా నిబంధనల వంటి పూర్తి సమాచారాన్ని చూపిస్తుంది. ఈ మేరకు అవసరమైన సిస్టమ్ డెవలప్‌మెంట్‌ను సీఆర్ఐఎస్ పూర్తి చేసిందని, ఈ సదుపాయాన్ని నేటి నుంచి అమలు చేయాలని రైల్వే బోర్డు అన్ని జోనల్ రైల్వేలను ఆదేశించింది.

### తరగతుల వారీగా లగేజీ పరిమితులు, చార్జీల వివరాలు

రైల్వేశాఖ ప్రయాణ తరగతిని బట్టి లగేజీ పరిమితులను స్పష్టంగా నిర్దేశించింది.

ఏసీ ఫస్ట్ క్లాస్: 70 కిలోల వరకు ఉచితం. అదనపు చార్జీలు చెల్లించి గరిష్ఠంగా 150 కిలోల వరకు తీసుకెళ్లవచ్చు.

ఫస్ట్ క్లాస్, ఏసీ 2–టైర్: 50 కిలోల వరకు ఉచితం. గరిష్ఠంగా 100 కిలోల వరకు అనుమతి ఉంటుంది.

స్లీపర్ క్లాస్: 40 కిలోల వరకు ఉచితం. గరిష్ఠంగా 80 కిలోల వరకు తీసుకెళ్లవచ్చు.

సెకండ్ క్లాస్: 35 కిలోల వరకు ఉచితం. గరిష్ఠంగా 70 కిలోల వరకు అనుమతి ఉంది.

ఏసీ 3–టైర్, ఏసీ 3 ఎకానమీ, ఏసీ చైర్ కార్: ఈ తరగతుల్లో ఉచిత, గరిష్ఠ పరిమితి రెండూ 40 కిలోలే. కాబట్టి ఈ క్లాసుల్లో ప్రయాణించేవారు అదనపు లగేజీని బుక్ చేసుకునే అవకాశం లేదు.

### లగేజీ సైజ్, చార్జీల వివరాలు

కోచ్‌లలోకి తీసుకెళ్లగల లగేజీ బ్యాగుల గరిష్ఠ పరిమాణాలను కూడా రైల్వే నిర్దేశించింది. ఏసీ 3–టైర్, ఏసీ 3 ఎకానమీ, ఏసీ చైర్ కార్‌లలో 55 సెం.మీ ఇ 45 సెం.మీ ఇ 22.5 సెం.మీ ఉండాలి. అదే ఏసీ ఫస్ట్ క్లాస్, ఏసీ 2–టైర్, స్లీపర్, జనరల్ క్లాసుల్లో 100 సెం.మీ ఇ 60 సెం.మీ ఇ 25 సెం.మీ వరకు అనుమతి ఉంటుంది. అదనపు లగేజీకి సాధారణ లగేజీ రేటు కంటే 1.5 రెట్లు ఎక్కువ చార్జ్ వసూలు చేస్తారు. కనీస చార్జీ రూ. 30గా నిర్ణయించారు.

### ఆన్‌లైన్ బుకింగ్ ప్రక్రియ ఎలా ఉంటుంది?

ప్రయాణికులు ఇండియన్ రైల్వేస్ పార్శిల్ పోర్టల్‌లోకి లాగిన్ అయి, బయలుదేరే, చేరాల్సిన స్టేషన్లు, రైలు వివరాలు ఎంచుకోవాలి. తర్వాత ఫార్వార్డింగ్ నోట్‌ను పూరించి, అంచనా చార్జీలను చెక్ చేసుకోవాలి. ఆన్‌లైన్ ఫామ్ సమర్పించాక, దాని ప్రింటవుట్‌తో పాటు లగేజీని బయలుదేరే స్టేషన్‌లోని పార్శిల్ కార్యాలయంలో అప్పగించాలి. అక్కడ లగేజీని తూకం వేసి, తుది చార్జీలను లెక్కిస్తారు. చెల్లింపు పూర్తయ్యాక రైల్వే రసీదు (ఆర్ఆర్) ఇస్తారు. అనంతరం, ట్రాక్ ఢ ట్రేస్ సదుపాయం ద్వారా లగేజీని ట్రాక్ చేయవచ్చు. లగేజీ గమ్యస్థానానికి చేరినప్పుడు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందుతుంది. అసలు రైల్వే రసీదును చూపించి లగేజీని డెలివరీ తీసుకోవచ్చు. ఈ మార్పుతో బుకింగ్ ప్రక్రియ సులభతరం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# పేరు 'బొద్దింక'.. లోపల మాత్రం ఇంద్రభవనం.. బీహార్ కేఫ్ స్టోరీ ఇది!

బీహార్‌లో కొత్తగా ప్రారంభమైన 'కాక్‌రోచ్ కేఫ్' – విచిత్రమైన పేరుతో సోషల్ మీడియాలో వైరల్

వైరల్ అవ్వాలనే ఆ పేరు పెట్టామన్న యజమాని – పేరుకు భిన్నంగా శుభ్రంగా, ఆకర్షణీయంగా ఉన్న కేఫ్

ఫుడ్‌లో పురుగులొస్తే ఫిర్యాదు చేసే ఛాన్స్ లేదంటూ నెటిజన్ల కామెంట్స్




ఒక వ్యాపారం విజయవంతం కావాలంటే నాణ్యతతో పాటు కాస్తంత ప్రచారం కూడా అవసరం. కానీ, ఆ ప్రచారం కోసం ఏకంగా తమ కేఫ్‌కే 'బొద్దింక కేఫ్' (జశీఛిత్రీశీబిష్ట్ర ఝుటవ) అని పేరు పెట్టి అందరినీ ఆశ్చర్యపరిచారు బీహార్‌లోని ఓ వ్యాపారి. నలంద జిల్లాలోని హిల్సా బైపాస్ రోడ్డులో కొత్తగా ప్రారంభమైన ఈ కేఫ్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. దాని విచిత్రమైన పేరు కారణంగా నెటిజన్లు ఫన్నీ కామెంట్స్‌తో హోరెత్తిస్తున్నారు. "ఇకపై మీ ఫుడ్‌లో బొద్దింక వస్తే ఫిర్యాదు చేసే అవకాశం కూడా లేదు" అంటూ సరదాగా పోస్టులు పెడుతున్నారు.

### పేరు వెనుక అసలు కారణం ఇదే

కేవలం అందరి దృష్టిని ఆకర్షించేందుకే ఈ పేరు పెట్టామని కేఫ్ యజమాని తెలిపారు. 'ఎన్‌డీటీవీ'తో మాట్లాడుతూ.. "ఈ రోజుల్లో యువత కొత్తదనాన్ని, విభిన్నంగా ఉండే విషయాలను ఇష్టపడుతున్నారు. ఎక్కడ చూసినా 'రాయల్ కేఫ్' లాంటి పేర్లు వందల సంఖ్యలో ఉంటాయి.

కానీ 'కాక్‌రోచ్ కేఫ్' మాత్రం ఒక్కటే ఉంటుంది. మా కేఫ్ పేరు విని జనం నవ్వుకోవాలి, దాని గురించి చర్చించుకోవాలి. ఆ పేరు చూసి లోపలికి వచ్చిన వారు, ఇక్కడి నాణ్యత చూసి మళ్లీ మళ్లీ రావాలి. పేరు ఎలా ఉన్నా శుభ్రత విషయంలో మేం అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. దీన్ని కేవలం బ్రాండింగ్ వ్యూహంగానే చూడాలి" అని వివరించారు. సోషల్ మీడియా యుగంలో ప్రకటనలకు పెద్దగా ఖర్చు చేయకుండానే ఇలాంటి వినూత్నమైన పేరుతో సులభంగా ప్రచారం పొందవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

### లోపల ఎలా ఉందంటే?

'బొద్దింక కేఫ్' అనే పేరు వినగానే చాలామంది అపరిశుభ్రంగా ఉంటుందని అనుకోవచ్చు. కానీ, వాస్తవానికి ఈ కేఫ్ లోపల ఆధునిక హంగులతో చాలా ఆకర్షణీయంగా ఉంది. నలుపు రంగు థీమ్‌తో, తగరపు పైకప్పునకు వేలాడుతున్న పసుపు రంగు లైట్లతో ఇంటీరియర్ ఆకట్టుకుంటోంది. గోడలకు కృత్రిమ పూల తీగలు, నలుపు రంగు సోఫాలు, ఎరుపు కుషన్లు, గ్లాస్ టేబుళ్లతో కస్టమర్లకు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించారు. సాయంత్రం వేళల్లో యువత ఇక్కడకు వచ్చి టీ, స్నాక్స్ తింటూ, సోషల్ మీడియా రీల్స్ చేసుకుంటూ సందడి చేస్తున్నారు.

### ప్రజల స్పందన

ఈ కేఫ్ పేరుపై సోషల్ మీడియాలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొందరు దీనిని ఒక సాహసోపేతమైన మార్కెటింగ్ ఆలోచనగా అభివర్ణిస్తుంటే, మరికొందరు మాత్రం సరదాగా సెటైర్లు వేస్తున్నారు. స్థానికుడైన రాకేశ్ అనే యువకుడు మాట్లాడుతూ.. "మొదట ఈ పేరు చూసి ఎవరో కావాలనే ప్రాంక్ చేస్తున్నారనుకున్నాను. కానీ లోపలికి వెళ్లి చూశాక ఆశ్చర్యపోయాను. ఈ ప్రదేశం చాలా శుభ్రంగా, సెల్ఫీలు దిగడానికి అనువుగా ఉంది" అని చెప్పాడు. అయితే, కొంతమంది పెద్ద వయసు వారు ఈ పేరును విమర్శిస్తుండగా, యువత మాత్రం ఈ క్రియేటివ్ బ్రాండింగ్‌ను మెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం ఈ కేఫ్‌లో టీ, కాఫీ, మ్యాగీ, శాండ్‌విచ్‌లు, శీతల పానీయాలు అందుబాటులో ఉన్నాయి. కేవలం మూడు రోజుల క్రితమే ప్రారంభమైనప్పటికీ, తన వినూత్నమైన పేరుతో ఈ కేఫ్ విపరీతమైన ప్రచారం పొందింది. వ్యాపారంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు సగం విజయాన్ని అందిస్తుందని ఈ 'బొద్దింక కేఫ్' నిరూపిస్తోంది.

# కుమార్తె వివాహానికి రావాలంటూ అల్లు అర్జున్‌కు పెళ్లి కార్డు అందించిన బండ్ల గణేశ్

త్వరలో సూర్యతేజ చిలుకూరితో బండ్ల గణేశ్ కుమార్తె జనని వివాహం

జోరుగా పెళ్లి పనులు

ప్రముఖులను కలిసి వివాహ పత్రికలు అందిస్తున్న బండ్ల గణేశ్

తాజాగా అల్లు అర్జున్‌ను కలిసిన వైనం




ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ తన కుమార్తె వివాహానికి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను స్వయంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వీరిద్దరి ఆత్మీయ కలయికకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.బండ్ల గణేశ్ కుమార్తె జనని వివాహం సూర్యతేజ చిలుకూరితో త్వరలో జరగనుంది. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా బండ్ల గణేశ్ సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులను వ్యక్తిగతంగా కలిసి పెళ్లి పత్రికలు అందిస్తున్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం అల్లు అర్జున్‌ను ఆయన నివాసంలో కలిసి వివాహానికి రావాలని కోరారు. ఈ కలయికపై బండ్ల గణేశ్ సోషల్ మీడియాలో ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. "మా కుమార్తె వివాహ వేడుకలకు అల్లు అర్జున్ గారిని వ్యక్తిగతంగా ఆహ్వానించడం నాకూ, నా కుటుంబానికీ ఎంతో ఆనందాన్నిచ్చింది. నా బ్యానర్‌లో 'ఇద్దరమ్మాయిలతో' నటించిన హీరోగా ఆయనతో నాకున్న బంధం ఎప్పుడూ ప్రత్యేకమైనదే. మా ఆహ్వానాన్ని స్వీకరించి, విలువైన సమయం కేటాయించిన బన్నీ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. మీ ప్రేమ, మద్దతు ఎప్పటికీ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను" అని ఆయన పేర్కొన్నారు.


# ఏపీ ఓటర్ల జాబితాలో భారీ మార్పులు.. 45 లక్షల ఓట్లు తొలగింపు.. మీ ఓటు ఉందో లేదో చూసుకోండి!

**ఏపీలో ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసిన ఎన్నికల సంఘం - ప్రత్యేక సవరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 45 లక్షల ఓట్ల తొలగింపు**

**శాశ్వతంగా వలస వెళ్లిన, మరణించిన, డూప్లికేట్ ఓట్లను తొలగించినట్లు వెల్లడి**

**పేర్ల నమోదు, అభ్యంతరాలకు ఆగస్టు 30 వరకు అవకాశం - అక్టోబర్ 3న ఓటర్ల తుది జాబితాను ప్రచురించనున్న ఈసీ**



అమరావతి, సింధూరదర్శిని: ఏపీలో ఓటర్ల జాబితాలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ముమ్మర సవరణ అనంతరం దాదాపు 45 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగిస్తూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఈరోజు ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. మరణించిన వారు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న వారి పేర్లను ఈ జాబితా నుంచి తొలగించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) వివేక్ యాదవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తొలగించిన ఓట్లలో శాశ్వతంగా చిరునామా మారిన లేదా అందుబాటులో లేని వారు 22.30 లక్షల మంది ఉన్నారు. మరణించిన వారివి 15.22 లక్షల ఓట్లు కాగా, రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు నమోదు చేసుకున్న 7.37 లక్షల మంది ఓట్లను కూడా తొలగించారు. ఈ సవరణ ప్రక్రియను జూన్ 15 నుంచి జూలై 24 వరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పకడ్బందీగా నిర్వహించారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలోని మొత్తం 4,16,27,694 మంది ఓటర్లకు గాను 3.71 కోట్ల మంది (89.22%) నుంచి బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించారు. మిగిలిన 44.89 లక్షల మంది ఓటర్లు వారి చిరునామాలో అందుబాటులో లేకపోవడం, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడం, ఫారాలు సమర్పించకపోవడం లేదా ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఇష్టపడకపోవడం వంటి కారణాల వల్ల వారి వివరాలను సేకరించలేకపోయినట్లు సీఈఓ వివరించారు. అయితే, జాబితా నుంచి పేర్లు తొలగిపోయిన అర్హులైన ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. అలాంటి వారు తమ ఓటు హక్కును తిరిగి పొందేందుకు అవకాశం కల్పించారు. ఇవాళ్టి నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తారు. అర్హులైన వారు నిర్దేశిత డిక్లరేషన్ ఫారంతో పాటు ఫారం-6ను సమర్పించి, తమ పేరును తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చుకోవచ్చు. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లు ఉన్న వారి పేరును వారు కోరుకున్న ఒక్క చోట మాత్రమే ఉంచుతారు. ప్రజల సౌలభ్యం కోసం తొలగించిన ఓటర్ల జాబితాను రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఈఆర్ఓ/ఏఈఆర్ఓ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల నోటీస్ బోర్డులపై ప్రదర్శనకు ఉంచారు. అలాగే, సీఈఓ, జిల్లా ఎన్నికల అధికారుల వెబ్‌సైట్లలో కూడా ఈ జాబితాలు అందుబాటులో ఉన్నాయి. వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు పరిష్కరించి, అక్టోబర్ 3న ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తామని వివేక్ యాదవ్ తెలిపారు.

ఈ భారీ ప్రక్రియలో జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, 46,397 మంది బీఎల్ఓలు సమన్వయంతో పనిచేశారని ఆయన అభినందించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు కూడా ఈ ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్నాయని, గతంలో 68,868 మంది బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ) ఉండగా, ఇప్పుడు వారి సంఖ్య 1,27,868కి పెరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో వినాయక విగ్రహాల ఎత్తుపై పోలీసుల ఆంక్షలు

**గతేడాది జరిగిన ప్రమాదాల నేపథ్యంలో తయారీదారులకు సీపీ సజ్జనార్ సూచనలు - విగ్రహాల ఎత్తు 16 అడుగులకు మించొద్దన్న సజ్జనార్**

**మట్టి విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహించాలని కళాకారులకు పిలుపు - విగ్రహాల తరలింపునకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాల ఏర్పాటు**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**



హైదరాబాద్, సింధూరదర్శిని:వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సైబరాబాద్ పోలీసులు పటిష్టమైన చర్యలు చేపడుతున్నారు. గత ఏడాది నిమజ్జనం సమయంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి విగ్రహాల ఎత్తు 16 అడుగులకు మించరాదని సీపీ వీసీ సజ్జనార్ విగ్రహ తయారీదారులకు స్పష్టం చేశారు. గురువారం బంజారాహిల్స్‌లోని కమిషనరేట్‌లో విగ్రహాల తయారీదారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ, గతేడాది కమిషనరేట్ పరిధిలో సుమారు 23 వేల విగ్రహాలను ప్రతిష్ఠించారని, వాటి రవాణా సమయంలో నాలుగు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. ఈసారి అటువంటి పొరపాట్లకు తావివ్వకుండా భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ధూల్‌పేట్, జల్పల్లి, మైలార్‌దేవ్‌పల్లి వంటి ప్రాంతాల నుంచి విగ్రహాలను నగరంలోకి తరలించేందుకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. కళాకారులు సామాజిక బాధ్యతతో మట్టి విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహించాలని, భక్తులు కూడా సులభంగా నిమజ్జనం చేసే చిన్న విగ్రహాలను ఎంచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విగ్రహాల లోడింగ్, అన్‌లోడింగ్ కోసం వాడే క్రేన్లు, రవాణా వాహనాలకు తప్పనిసరిగా సర్టిఫికేషన్ ఉండాలని, అనుభవజ్ఞులైన సిబ్బందితోనే వాటిని నడపాలని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఈ ఏడాది అధికమాసం.. తిరుమలలో రెండుసార్లు శ్రీవారి బ్రహ్మోత్సవాలు

వాహన సేవల పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసిన టీటీడీ తిరుమల శ్రీవారి భక్తులకు ఈ ఏడాది కనుల పండుగ కలగనుంది. అధికమాసం కారణంగా కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి రెండుసార్లు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బ్రహ్మోత్సవాల తేదీలను, పూర్తిస్థాయి వాహన సేవల వివరాలను అధికారికంగా ప్రకటించింది. దీంతో తిరుమల గిరులు గోవింద నామస్మరణతో మరోసారి మార్మోగనున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్‌లో వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు, ఆ తర్వాత అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. సాధారణంగా తెలుగు పంచాంగం ప్రకారం అధిక మాసం వచ్చిన సంవత్సరాల్లో శ్రీవారికి రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ సంప్రదాయాన్ని అనుసరిస్తూ టీటీడీ ఈ ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తోంది. మొదటగా, సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు నవాహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. దీనికి సెప్టెంబర్ 14వ తేదీ సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల



వరకు స్వామివారు వివిధ వాహనాలపై తిరుమాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించనున్నారు.

**సాలకట్ల బ్రహ్మోత్సవాల వాహన సేవల పూర్తి షెడ్యూల్:**

సెప్టెంబర్ 15 (మొదటి రోజు): సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి 9 గంటలకు పెద్ద శేష వాహనం.

సెప్టెంబర్ 16 (రెండో రోజు): ఉదయం చిన్న శేష వాహనం, రాత్రి హంస వాహనం.

సెప్టెంబర్ 17 (మూడో రోజు): ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహనం.

సెప్టెంబర్ 18 (నాలుగో రోజు): ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం.

సెప్టెంబర్ 19 (ఐదో రోజు): ఉదయం మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహన సేవ (సాయంత్రం 6:30 నుంచి రాత్రి 11:30 వరకు).

సెప్టెంబర్ 20 (ఆరో రోజు): ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం స్వర్ణ రథం, రాత్రి గజ వాహనం.

సెప్టెంబర్ 21 (ఏడో రోజు): ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం.

సెప్టెంబర్ 22 (ఎనిమిదో రోజు): ఉదయం 7 గంటలకు రథోత్సవం (మహారథం), రాత్రి అశ్వ వాహనం.

సెప్టెంబర్ 23 (తొమ్మిదో రోజు): ఉదయం 6 నుంచి 9 గంటల వరకు చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ సాలకట్ల బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత, అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలను కూడా టీటీడీ నిర్వహించనుంది. ఈ వివరాలను టీటీడీ ముఖ్య ప్రజాసంబంధాల అధికారి కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ రెండు బ్రహ్మోత్సవాల సందర్భంగా లక్షలాదిగా భక్తులు తిరుమలకు తరలివచ్చే అవకాశం ఉండటంతో టీటీడీ అన్ని రకాల ఏర్పాట్లను పకడ్బందీగా చేస్తోంది.



# మా దేశం సురక్షితం.. భారత జట్టు తప్పక వస్తుంది

## బీసీబీ ప్రెసిడెంట్ తమీమ్ ఇక్బాల్

**భారత్‌తో వైట్-బాల్ సిరీస్ నిర్వహణకు బంగ్లాదేశ్ ప్రయత్నాలు**

**ఈ సెప్టెంబర్‌లో 6 మ్యాచ్‌లు ఆడేలా బీసీసీఐతో చర్చలు**

**మా దేశం అత్యంత సురక్షితం అని భరోసా ఇస్తున్న తమీమ్ ఇక్బాల్**

**ఈ సిరీస్ జరిగితే ఆఫ్ఘనిస్థాన్‌తో టీమిండియా సిరీస్ వాయిదా పడే ఛాన్స్**

**2025లో జరగాల్సిన టూర్‌ను ముందుకు జరిపేందుకు బీసీబీ ఆసక్తి**

భారత క్రికెట్ జట్టుతో పరిమిత ఓవర్ల సిరీస్ నిర్వహించేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో మూడు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌కు ఆతిథ్యం ఇవ్వాలని ఆశిస్తున్నట్లు బీసీబీ అధ్యక్షుడు తమీమ్ ఇక్బాల్ తెలిపాడు. వాస్తవానికి ఈ పర్యటన 2025 ఆగస్టులో జరగాల్సి ఉండగా, ఇరు బోర్డుల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు వాయిదా పడింది. ఇప్పుడు ఆ సిరీస్‌ను ముందుకు జరిపి ఈ సెప్టెంబర్‌లోనే నిర్వహించాలని బీసీబీ భావిస్తోంది. బుధవారం జరిగిన మీడియా సమావేశంలో తమీమ్ ఇక్బాల్ ఈ విషయంపై స్పందించాడు. "భారత్‌తో సిరీస్‌పై ప్రస్తుతానికి నా వద్ద కచ్చితమైన సమాచారం లేదు. కానీ, మేము బీసీసీఐతో చర్చిస్తున్నాం. ఇరు బోర్డుల సభ్యుల మధ్య ఈ-మెయిల్స్ ద్వారా సంప్రదింపులు జరుగుతున్నాయి. ఈ సిరీస్‌ను సాకారం చేసేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నాం" అని అన్నాడు. భారత్-బంగ్లాదేశ్ సిరీస్ అంటే అభిమానులు, క్రికెటర్లు, మీడియాలో ఎంతో ఉత్సాహం ఉంటుందని తమీమ్ పేర్కొన్నాడు. "బంగ్లాదేశ్ అత్యంత సురక్షితమైన దేశం. భారత జట్టు ఇక్కడికి వస్తుందని నేను గట్టిగా నమ్ముతున్నాను. మా వైపు నుంచి తీసుకోవాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నాం" అని భరోసా ఇచ్చాడు. అయితే, ఈ సిరీస్ జరిగితే టీమిండియా షెడ్యూల్‌లో మార్పులు తప్పకపోవచ్చు. ఇప్పటికే ఖరారైన షెడ్యూల్ ప్రకారం భారత జట్టు సెప్టెంబర్‌లో స్వదేశంలో ఆఫ్ఘనిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్ ఆడాల్సి ఉంది. ఒకవేళ బంగ్లాదేశ్ పర్యటన ఖరారైతే, ఆఫ్ఘన్ సిరీస్ వాయిదా పడే అవకాశం ఉంది. దీనికి తోడు టీమిండియా ఆగస్టులో శ్రీలంకలో రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 24 నుంచి జపాన్‌లో ప్రారంభమయ్యే ఆసియా క్రీడల్లో కూడా పాల్గొనాల్సి ఉంది. ఈ క్రమంలోనే బీసీసీఐని ఒప్పించేందుకు తాను తీవ్రంగా కృషి చేస్తున్నట్లు తమీమ్ తెలిపాడు. "బీసీబీ అధ్యక్షుడిగా నాకు కొన్ని పరిమితులు ఉంటాయి. వాటిని నేను దాటకూడదు. కానీ, నా పరిధిలో సాధ్యమైనంత వరకు ప్రయత్నిస్తున్నాను. ఈ సిరీస్ జరిగితే కలిగే ప్రయోజనాల గురించి వారికి వివరిస్తున్నాను" అని చెప్పుకొచ్చాడు. చివరిసారిగా భారత జట్టు 2022లో బంగ్లాదేశ్‌లో పర్యటించింది. ఆ పర్యటనలో జరిగిన వన్డే సిరీస్‌ను బంగ్లాదేశ్ 2-1తో గెలుచుకోగా, టెస్టు సిరీస్‌ను భారత్ 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది.

# మూడోరోజూ కొనసాగిన లాభాలు..

**166 పాయింట్లు ఎగిసిన సెన్సెక్స్**


**78,094.64 వద్ద స్థిరపడ్డ సెన్సెక్స్**

**66.45 పాయింట్లు పెరిగి 24,383.60 వద్ద ముగిసిన నిఫ్టీ**

**రాణించిన ఆటో, ఎఫ్ఎంసీజీ షేర్లు**

**త్రైమాసిక ఫలితాలు అంచనాలను మించడంతో మార్కెట్లకు ఊతం**


**ఆర్థిక అనిశ్చితులు తగ్గితే ఈ ర్యాలీ కొనసాగొచ్చన్న నిపుణులు**



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. ఆటో, ఫైనాన్షియల్ రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో మార్కెట్లకు ఊతం లభించింది. మరోవైపు ఇటీవల భారీగా పెరిగిన ఐటీ షేర్లలో పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో ఆ రంగంపై ఒత్తిడి కనిపించింది. సెన్సెక్స్ 166.49 పాయింట్లు పెరిగి 78,094.64 వద్ద, నిఫ్టీ 66.45 పాయింట్లు ఎగిసి 24,383.60 వద్ద ముగిశాయి. బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు నిఫ్టీలో అత్యధిక లాభాలు నమోదు చేశాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా 0.44 శాతం చొప్పున పెరిగాయి. ఆటో రంగంతో పాటు ఎఫ్ఎంసీజీ షేర్లు కూడా మంచి ప్రదర్శన కనబరిచాయి. అయితే ఐటీ సూచీ ఐదు రోజుల లాభాల పరంపరకు బ్రేక్ పడింది.ప్రస్తుతం నిఫ్టీకి 24,300 స్థాయి తక్షణ మద్దతుగా ఉంటుందని మార్కెట్ నిపుణులు తెలిపారు. ఆ స్థాయి కంటే దిగువకు వెళితే 24,200 వద్ద మరో కీలక మద్దతు ఉందన్నారు. త్రైమాసిక ఫలితాలు అంచనాల కంటే మెరుగ్గా వస్తుండటం మార్కెట్లకు బలాన్నిస్తోందన్నారు. ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు తగ్గితే ఈర్యాలీ కొనసాగొచ్చని అభిప్రాయపడ్డారు.

# సినిమా న్యూస్

## 'న్యూటన్స్ థర్డ్ లా' మూవీ రివ్యూ




'న్యూటన్స్ థర్డ్ లా' మూవీ రివ్యూ
నటీనటులు: సుమంత్, త్రినాథ్ వర్మ, రవివర్మ, షెల్లీ కుమార్, నేహా పఠాన్, జగపతిబాబు, అవసరాల శ్రీనివాస్ తదితరులు సంగీతం: సింజిత్ ఎర్రమిల్లి ఛాయా గ్రహణం: వేదవ్యాస్ నిర్మాత: హరీష్ రచన-దర్శకత్వం: రాజేష్ కర్ణ

అప్పుడప్పుడూ ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తుంటాడు సీనియర్ హీరో సుమంత్. గత ఏడాది 'అనగనగా' అనే మంచి సినిమా చేశాడు. కానీ అది ఓటీటీకే పరిమితమైంది. ఇప్పుడు 'న్యూటన్స్ థర్డ్ లా' అనే థ్రిల్లర్ మూవీతో థియేటర్ ప్రేక్షకులను పలకరించాడు. ప్రోమోలతో ఆసక్తి రేకెత్తించిన ఈ చిత్రం.. ప్రేక్షకులను మెప్పించిందా? కథ: 2026లో డేవిడ్ (అవసరాల శ్రీనివాస్) అనే బిగ్ షాట్‌కు ఎవరో న్యూటన్స్ థర్డ్ లా అనే ఒక పుస్తకాన్ని కొరియర్లో పంపిస్తారు. ఆ పుస్తకంలో 1999లో జరిగిన ఓ వాస్తవ కథ ఉంటుంది. కూతురితో కలిసి రాత్రి పూట రోడ్డు మీద నడుస్తుంటే ఓ కార్ వచ్చి ఢీకొట్టడంతో జ్యోతి (నేహా పఠాన్) చనిపోతుంది. మరోవైపు వర్తమానంలో కొన్ని రోజులకే వినయ్(త్రినాథ్ వర్మ) బిల్డింగ్ మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటాడు. వినయ్ కేసును విచారించడానికి పోలీసాఫీసర్ వాసుదేవ్(సుమంత్) వస్తాడు. పోస్టుమార్టం రిపోర్టులో వినయ్ ఆత్మహత్య చేసుకోలేదు.. తనది హత్య అని తేలుతుంది. వినయ్ చనిపోయేముందు ఏదో తప్పు చేసాడని.. అదేంటో కనిపెట్టాలని వాసుదేవ్ ప్రయత్నిస్తాడు. అలాగే వినయ్ తల్లితండ్రులు కూడా తన దగ్గర ఏదో దాస్తున్నారని కనిపెడతాడు. మరి జ్యోతి యాక్సిడెంట్ కేసుకి, వినయ్ హత్యకి ఏమైనా సంబంధం ఉందా? ఈ మరణాల వెనుక ఎవరైనా ఉన్నారా? వినయ్ చనిపోయేముందు ఏం తప్పు చేసాడు? వినయ్ తల్లిదండ్రులు ఏం దాస్తున్నారు? న్యూటన్స్ థర్డ్ లా బుక్ ఎవరు రాశారు? అది డేవిడ్ కి ఎందుకు పంపారు? స్టీఫెన్ మెర్క్యూరీ (జగపతిబాబు)కి ఈ వ్యవహారాలకు సంబంధం ఏంటి అనేది మిగతా కథ. కథనం - విశ్లేషణ: ఓటీటీ విప్లవం తర్వత మన ప్రేక్షకులు మలయాళం థ్రిల్లర్లకు బాగా అలవాటు పడ్డారు. ఇక్కడ ఏదైనా థ్రిల్లర్ సినిమా తెరకెక్కినా మలయాళం సినిమాలతోనే పోల్చుతున్నారు. అందుకే మన ఫిలిం మేకర్స్ కూడా థ్రిల్లర్ సినిమాలు తీసేటపుడు ఆ చిత్రాలనే ఫాలో అవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అక్కడ రెండు- రెండున్నర గంటల నిడివితో ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ సినిమాలు తీస్తే.. గంటన్నర పాటు ఒకలా కథను నడిపించి.. కొన్ని చోట్ల బాగా సాగదీసి.. చివర్లో ఒక్కసారిగా ట్విస్టుల మీద ట్విస్టులిచ్చి కథను ఊహించని విధంగా ముగిస్తుంటారు. ప్రేక్షకులకు షాకిస్తుంటారు. 'న్యూటన్స్ థర్డ్ లా' కూడా అచ్చం ఇలాగే సాగే సినిమా. ఐతే చివరి 20 నిమిషాలు సర్ప్రైజులు.. షాకులతో బాగానే అనిపిస్తుంది కానీ... అప్పటి వరకు ఎదురు చూడడం మాత్రం సహనానికి పరీక్షే. థ్రిల్లర్ సినిమాలకు స్క్రీన్ ప్లే అత్యంత కీలకమైన అంశం. ముఖ్యంగా ఇన్వెస్టిగేషన్ తో నడిచే సస్పెన్స్ థ్రిల్లర్లకు ఆసక్తికర కథనం తోడైతే ఆ జానర్ లవర్స్ బాగా ఎంజాయ్ చేస్తారు. ఐతే ఈ స్క్రీన్ ప్లే కొంచెం తెలివిగా.. ప్రేక్షకులను థ్రిల్ చేసేలా ఉండాలి. అంతే తప్ప.. అతి తెలివి చూపించేలా ఉంటే కష్టం. కథ కోసం ట్విస్టులే తప్ప.. ట్విస్టుల కోసం కథ అన్నట్లుగా ఉన్నా ఇబ్బందే. 'న్యూటన్స్ థర్డ్ లా' ఇలాగే అనిపిస్తుంది. 'న్యూటన్స్ థర్డ్ లా' కథ ఔట్ లైన్ ఎంతో ఆసక్తికరంగా అనిపించేదే. కానీ ఆ కథను తెరపై ఎగ్జిక్యూట్ చేసిన విధానం అనుకున్నంత ఆసక్తికరంగా లేదు. ఈ కథ ఆరంభంలో ఎన్నో ప్రశ్నలు తలెత్తుతాయి. వాటికి చివర్లో ఇచ్చిన సమాధానాలు బాగున్నాయి. డాట్స్ కనెక్ట్ చేసిన తీరు బాగుంది. 'ప్రతి చర్యకూ ప్రతిచర్య ఉంటుంది' అనే న్యూటన్స్ థర్డ్ లాను కథగా చెప్పిన విధానం ఆకట్టుకుంటుంది. కానీ ఈ అంశాలు ఓకే అనిపించినా.. ఈ సినిమా ఎక్కువ సమయం అనాసక్తికరంగా సాగడం వల్ల ప్రేక్షకులను అనుకున్నంతగా ఎంగేజ్ చేయలేకపోయింది. 'న్యూటన్స్ థర్డ్ లా'కు అతి పెద్ద మైనస్ ఇన్వెస్టిగేషన్ సీన్లు. ఏమంత క్యూరియాసిటీ కలిగించకుండా.. విపరీతమైన సాగతీతగా అనిపించే ఆ సీన్లు సినిమా ఫ్లోను దెబ్బ తీశాయి. ఈ కథను ఆరంభించిన తీరు బాగుంది. ముగింపూ ఆకట్టుకుంటుంది. కానీ మధ్యలో మాత్రం అసహనం తప్పదు. డేవిడ్ అనే వ్యక్తికి పుస్తకం రావడంతో ఆ బుక్కేంటి.. అది అతడికి ఎవరు పంపారు? ఎందుకు పంపారు? అది చూసి డేవిడ్ ఎందుకు భయపడ్డాడు అనే ప్రశ్నలతో సినిమా మొదలవుతుంది. ఇక కథలోకి వెళ్ళగానే జ్యోతి యాక్సిడెంట్- వినయ్ సూసైడ్ వెంటవెంటనే చూపించి ఈ రెంటి మధ్య కనెక్షన్ ఏంటా అనే ఆసక్తి కలిగించారు. కానీ తర్వాత వాసుదేవ్ ఎంట్రీ నుంచి ఇన్వెస్టిగేషన్ సీన్లు మాత్రం సాగదీశారు. ప్రథమార్ధంతో రేకెత్తిన ప్రశ్నలకు సమాధానాల కోసం ప్రేక్షకులు ఎదురు చూస్తుంటే.. మధ్యలోకి మరో ఫ్లాష్ బ్యాక్ వస్తుంది. అది కూడా సాగతీతగానే అనిపిస్తుంది. ఆ ఫ్లాష్ బ్యాక్ తో మరి కొన్ని ప్రశ్నలు తలెత్తుతాయి. అన్ని ప్రశ్నలకు సమాధానాలను చివరి పావుగంటలో ఒకదాని తర్వాత ఒకటి హడావిడిగా రివీల్ చేస్తారు. కానీ కొంచెం కన్ఫ్యూజన్ తప్పదు. అది చాలదని ముగింపులో వాసుదేవ్ గురించి ఏదేదో చెప్పి కథని ఎటెటో తీసుకెళ్లడంతో ఇంకాస్త గందరగోళం తప్పదు. కథ అక్కడికి పూర్తయినా సంబంధం లేకుండా పార్ట్-2కి లీడ్ ఇచ్చారు. ఇది సింపుల్ గా ఓ ఫ్లాష్ బ్యాక్, ఇన్వెస్టిగేషన్ తో నడిపించే కథ. కాకపోతే దర్శకుడు ఎక్కువ తెలివిని ఉపయోగించి వర్తమానం-గతం మధ్య సన్నివేశాలను చూపిస్తూ కన్ఫ్యూజింగ్ గా స్క్రీన్ ప్లేను రాసుకున్నారు. ప్రేక్షకుల బుర్రలకు పరీక్ష పెట్టాలని చూశారు కానీ.. ఆ వ్యవహారం కాస్తా అసహనం కలిగించేలా తయారైంది. ఓవరాల్ గా చెప్పాలంటే 'న్యూటన్స్ థర్డ్ లా' విషయం ఉన్న సినిమానే. కానీ ఆసక్తికర కథను పకడ్బందీగా చెప్పకపోవడంతో ఆశించిన అనుభూతిని ఇవ్వలేకపోయింది.

నటీనటులు: సటిల్డ్ గా నటించే పాత్రలంటే సుమంత్ కు కొట్టిన పిండే. క్రైమ్ కేసును ఇన్వెస్టిగేట్ చేసే పోలీస్ పాత్రలో అతను కూల్ గా నటిస్తూ ఆకట్టుకున్నాడు. 'కమిటీ కుర్రాళ్ళు' సినిమాతో మంచి పేరు తెచ్చుకున్న త్రినాథ్ వర్మ ఈ సినిమాలో ముఖ్య పాత్రలో మంచి పెర్ఫామెన్స్ ఇచ్చాడు. త్రినాథ్ వర్మ ఫ్రెండ్ పాత్ర చేసిన గౌతమ్ పండిట్ కూడా ఆకట్టుకున్నాడు. వినయ్ తల్లి పాత్రలో నటించిన షెల్లీ కుమార్ బాగా నటించింది. నేహా పఠాన్ కాసేపే కనిపించినా మెప్పించింది. జగపతి బాబుది అతిథి పాత్రలా అనిపిస్తుంది. ఆయన నటన ఓకే. అవసరాల శ్రీనివాస్.. రవివర్మ.. హరిణి రావు.. మిగిలిన నటీనటులు వారి పాత్రల్లో పర్వాలేదు అనిపించారు.

సాంకేతిక వర్గం: పరిమిత బడ్జెట్లో తెరకెక్కినప్పటికీ 'న్యూటన్స్ థర్డ్ లా' లో నిర్మాణ పరంగా మంచి క్వాలిటీ కనిపిస్తుంది. సినిమా సాంకేతికంగా బాగుంది. వేదవ్యాస్ విజువల్స్ ఆకట్టుకుంటాయి. జానర్ శైలికి తగ్గట్లు సినిమా అంతా కాస్త డార్క్ టోన్లో ఉంటుంది.

సింజిత్ ఎర్రమిల్లి బీజీఎం థ్రిల్లర్ సినిమాల శైలికి తగ్గట్లుగా సాగింది. పాటలు మాత్రం బాగాలేవు. దర్శకుడు రాజేష్ కర్ణ ఎంచుకున్న ఐడియా బాగుంది. కొన్ని స్క్రీన్ ప్లే లాక్స్ బాగున్నాయి. థ్రిల్లర్ సినిమాల్లో ఉండాల్సిన వేగం ఈ సినిమాలో కనిపించదు. అక్కడక్కడా కొన్ని మెరుపులున్నా.. ముగింపు బాగున్నా.. ఓవరాల్ ఎగ్జిక్యూషన్ అంత ఆసక్తికరంగా లేదు. చివరగా: న్యూటన్స్ థర్డ్ లా.. మెరుపులన్నీ ముగింపులోనే రేటింగ్ - 2.25/5



## రెండో పెళ్లిపై క్లారిటీ ఇచ్చిన నటి సురేఖావాణి

**ట్రోలింగ్, గాలి వార్తలపై ఘాటు స్పందన!**
**ఇటీవలి కాలంలో తెలుగు సినిమాలకు కాస్త దూరమైన సురేఖావాణి**
**తనకు రెండో పెళ్లి చేసుకునే ఆలోచన లేదని వెల్లడి**
**ఆ ఆలోచన ఉంటే ఇప్పటి వరకు ం ఆగేదాన్ని కాదన్న సురేఖ**

టాలీవుడ్‌లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించి గుర్తింపు పొందిన నటి సురేఖావాణి... కొంతకాలంగా తెలుగు సినిమాలకు కాస్త దూరమై తమిళ ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ప్రస్తుతం ఆమె దర్శకుడు కృష్ణ బలరామ్ తెరకెక్కిస్తున్న 'నిరమ్' అనే క్రైమ్ థ్రిల్లర్ మూవీలో నటిస్తున్నారు. తాన్యా హోప్, ప్రీతి అస్రాని, నితిన్ సత్య కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని కెస్వేర్ సినిమాస్ నిర్మిస్తుండగా, డి. ఇమ్మాన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్న సురేఖావాణి... తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న రకరకాల పుకార్లకు, సోషల్ మీడియా ట్రోలింగ్‌కు గట్టి సమాధానం ఇచ్చారు.

రెండో పెళ్లి వ్యవహారంపై మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. "నాకు రెండో పెళ్లి చేసుకునే ఉద్దేశం ఏమాత్రం లేదు. ఒకవేళ ఆ ఆలోచనే ఉంటే ఇప్పటివరకు ఆగేదాన్ని కాదు కదా? ఇప్పుడు నా కూతురికి పెళ్లి చేసే వయసు వచ్చింది, ఈ దశలో నాకేంటి పెళ్లి?" అని ప్రశ్నించారు. అంతేకాకుండా "నా పెళ్లి ఎప్పుడో జరిగిపోయిందని మీడియానే వార్తలు రాసేసిందిగా" అంటూ నవ్వుతూ వ్యాఖ్యానించారు. ఇక సోషల్ మీడియాలో వచ్చే విమర్శలపై స్పందిస్తూ.. "నాకు నచ్చిన ఫొటోలు, పోస్టులు నేను పెడతాను. నా జీవితం, నా ప్రాధాన్యతలు నాకే ముఖ్యం. పక్కవారు ఏమనుకుంటారో అని ఆలోచించడం మానేసి చాలా కాలమైంది" అని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లోనూ, సోషల్ మీడియాలోనూ ఆసక్తికరంగా మారాయి.



## స్పోర్ట్స్ డ్రామాతో నందమూరి తేజస్విని ఎంట్రీ?

**వెండితెరపైకి తేజస్విని ఎంట్రీ ఇస్తున్నారంటూ ప్రచారం - కథా చర్చలు శరవేగంగా జరుగుతున్నాయని సమాచారం**
**ఇప్పటికే సినీ నిర్మాణంలో భాగస్వామిగా వ్యవహరిస్తున్న తేజస్విని**

ప్రముఖ సినీ నటుడు, టీడీపీ హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని త్వరలోనే వెండితెరకు పరిచ యం కాబోతున్నారనే వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో, ఫిల్మ్‌నగర్ వర్గాల్లో హల్‌చల్ చేస్తోంది. అయితే, సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, ఒక ప్రయోగాత్మకమైన, యువతకు స్ఫూర్తినిచ్చే స్పోర్ట్స్ డ్రామా ద్వారా ఆమె ఎంట్రీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన కథా చర్చలు శరవేగంగా జరుగుతున్నాయని, అన్ని అంశాలు కుదిరితే త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సమాచారం.
ఇప్పటికే 'అన్‌స్టాపబుల్' టాక్ షోకు క్రియేటివ్ హెడ్‌గా, పలు సినిమాలకు నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించిన తేజస్విని... ఇప్పుడు నేరుగా నటిగా మారనున్నారనే వార్తలతో నందమూరి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మోక్షజ్ఞ కంటే ముందే ఆమె సందేశాత్మక చిత్రంతో వెండితెరపై మెరవబోతుండటం సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

## కర్ణాటకలో విజయ్ సినిమాకు కావేరి నీటి సెగ.. నిలిచిపోయిన ప్రదర్శనలు

కావేరీ జలాల వివాదం మరోసారి తమిళ చిత్ర పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపింది. తమిళ అగ్ర కథనాయకుడు, ముఖ్యమంత్రి విజయ్ నటించిన 'జన నాయగన్' చిత్ర ప్రదర్శనలు కర్ణాటక వ్యాప్తంగా నిలిచిపోయాయి. తమిళనాడుకు కావేరి జలాలను విడుదల చేయడాన్ని నిరసిస్తూ కన్నడ అనుకూల సంఘాలు, రైతులు ఆందోళనలు చేపడుతుండటంతో, శాంతిభద్రతల దృష్ట్యా థియేటర్ల యాజమాన్యాలు స్వచ్ఛందంగా షోలను రద్దు చేశాయి. జూలై 23న విడుదలైన ఈ చిత్రం కర్ణాటకలో సుమారు 125 నుంచి 150 థియేటర్లలో ప్రదర్శితమవుతోంది. అయితే, తాజా నిరసనల నేపథ్యంలో పలు థియేటర్ల వద్ద విజయ్ పోస్టర్లు, బ్యానర్లను నిరసనకారులు తొలగించారు. బెంగళూరులోని ప్రముఖ ఊర్వశి థియేటర్‌లో పోలీసుల సూచన మేరకు ప్రదర్శనలు నిలిపివేసి, విజయ్ సినిమా స్థానంలో 'కరవళి' అనే కన్నడ చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా థియేటర్ వద్ద పోలీసు బలగాలను మోహరించారు. మండ్యలో కన్నడ కార్యకర్తలు సినిమా ప్రమోషనల్ బ్యానర్లను చించివేయడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాలపై చర్చించేందుకు కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ సమావేశం ఏర్పాటు చేసింది. కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆదేశాల మేరకు, 15 రోజుల పాటు తమిళనాడుకు రోజుకు 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కర్ణాటకను ఆదేశించింది. అయితే, తమ రాష్ట్రంలోనే నీటి కొరత తీవ్రంగా ఉందని, ఈ నిర్ణయం వల్ల రైతులు నష్టపోతారని కన్నడ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. మరోవైపు, కావేరి బోర్డు ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని తమిళనాడు కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం స్పష్టం చేశారు.

## షూటింగ్‌లో రష్మికకు గాయం.. ఆరు వారాల విశ్రాంతి



**పాట చిత్రీకరణలో డ్యాన్స్ చేస్తుండగా ప్రమాదం**
**తుంటి భాగంలో తీవ్ర గాయమైనట్టు నిర్ధారణ**
**విశ్రాంతి తీసుకోవాలని సూచించిన వైద్యుల సూచన**

ప్రముఖనటి రష్మిక మందన్న ఒక చిత్రం షూటింగ్‌లో గాయపడ్డారు. ఒక పాట చిత్రీకరణలో భాగంగా డ్యాన్స్ చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆమెను పరీక్షించిన వైద్యులు తుంటి భాగంలో బలమైన గాయమైనట్లు నిర్ధారించి, ఆరు వారాల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రష్మిక మందన్న 'రణబాలి' అనే చిత్రంలో తన భర్త, హీరో విజయ్ దేవరకొండ సరసన నటిస్తున్నారు. దీనితో పాటు, 'మైసా' అనే మహిళా ప్రాధాన్యత కలిగిన చిత్రంలోనూ ఆమె ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. వరుస సినిమాలతో బిజీగా ఉన్న తరుణంలో రష్మిక గాయపడటం ఆమె నటిస్తున్న చిత్రాల షూటింగ్‌లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆరు వారాల పాటు రష్మిక విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో, ఆమె అంగీకరించిన సినిమాల చిత్రీకరణ షెడ్యూల్స్ వాయిదా పడనున్నాయి. ఈ గాయం నుండి ఆమె త్వరగా కోలుకోవాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662